శుక్రవారం
13-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 202
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

30,31 తేదీల్లో బ్యాంకుల సమ్మె

యూఎఫ్‌బీయూ పిలుపు

తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 30, 31 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేయనున్నారు.

2లో

సర్కార్‌కు షాక్

జీవో నం.1కు బ్రేక్ !

23వరకు సస్పెండ్ చేసిన హైకోర్టు

తదుపరి విచారణ 20కి వాయిదా

హర్షం వ్యక్తం చేసిన రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.1ని సస్పెండ్ చేస్తూ హైకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 20కి వాయిదా వేసింది. రహదారులపై బహిరంగ సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతులు లేవంటూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2వ తేదీ అత్యంత వివాదాస్పద జీవో నంబరు 1ని తీసుకొచ్చిన విషయం తెల్సిందే. దీనిపై అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు నిరసనలు వ్యక్తం చేశాయి. ఆ జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రజాందోళనలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ జీవోని రద్దు చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, దానిపై గురువారం విచారణ జరిగింది. పిటీషనర్ తరపున ప్రముఖ న్యాయవాది ఎస్ అశ్వినికుమార్, ప్రభుత్వ తరపున అడ్వకేట్ జనరల్ ఎల్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం కుట్ర పూరితంగా జీవో జారీ చేసిందని పిటిషనర్ పేర్కొన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారత దేశ చరిత్రలో ఇలాంటి జీవో ఎప్పుడైనా వచ్చిందా? స్వాతంత్ర్యానికి ముందైనా ఇలాంటి జీవో ఉందా? అని హైకోర్టు ప్రశ్నించింది. బ్రిటీష్ వాళ్లు ఈ చట్టం ఉపయోగిస్తే స్వాతంత్ర్య పోరాటం జరిగేదా? మనం ఏ రోజుల్లో ఉన్నామో అర్థం కావట్లేదు అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఎప్పుడూ ఇలాంటి జీవో రాలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన గత తీర్పులను కోర్టు ముందు ఉంచారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో పోలీస్ యాక్టు 30 నిబంధనలకు విరుద్ధంగా ఉందని అభిప్రాయపడిన హైకోర్టు, ఈ నెల 23వ తేదీ వరకు సస్పెండ్ చేస్తూ, దీనిపై కౌంటరు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 20కి వాయిదా వేసింది.

రద్దు చేయాల్సిందే !

- ఏఐటీయూసీ రాష్ట్రవ్యాప్త ఆందోళనలు
- ప్రశ్నించే గొంతుకలు లేకుండా చేసే కుట్ర : ఓబులేసు
- జగన్ నియంతృత్వ ధోరణికి పరాకాష్ఠ: రవీంద్రనాథ్

2లో

జగన్...ఇకనైనా కళ్లు తెరువు

జీవోని వెనక్కి తీసుకో

హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజాస్వామిక హక్కులను కాలరాసే జీవో నంబరు 1ని సస్పెండ్ చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇప్పటికైనా విజ్ఞత ప్రదర్శించి ఆ జీవోను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. రామకృష్ణ గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజా సమస్యలపై ఆందోళనలు అణచివేసేందుకు జగన్ సర్కార్ వివిధ రూపాల్లో నిర్బంధాలు కొనసాగిస్తున్నదని విమర్శించారు. చలో అసెంబ్లీ సహా ఏ కార్యక్రమం చేపట్టినా ఆయా పార్టీల నేతలను గృహ నిర్బంధం చేస్తూ రాజ్యాంగ హక్కులను కాలరాస్తోంది. నియంతృత్వ విధానాలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. ఇది పరకాష్ఠకు చేరి...కందుకూరు దుర్ఘటన సాకుతో నూతన సంవత్సర కానుకగా ప్రతిపక్షాల గొంతునొక్కే జీవో నంబరు 1 తీసుకొచ్చింది. ఈ జీవోను కూడా ప్రతిపక్షాలకు ఒక రకంగా, అధికారపార్టీకి మరో విధంగా అమలు చేస్తున్నది. అన్ని రాజకీయపార్టీలు, ప్రజాస్వామ్యశక్తులన్నీ ముక్తకంఠంతో జీవోను నిరసించాయి. ప్రతిపక్షాల గొంతు నొక్కే ఈ జీవోను రద్దు చేయాలని కోరుతూ తాను హైకోర్టును ఆశ్రయించానని రామకృష్ణ తెలిపారు. దీనిపై విచారించిన హైకోర్టు... సెక్షన్ 30 పోలీస్ యాక్టు విధానాలకు భిన్నంగా జీవో ఉన్నట్లు స్పష్టం చేస్తూ దానిని సస్పెండ్ చేసిందని రామకృష్ణ వెల్లడించారు. జీవో నంబరు 1ని హైకోర్టు సస్పెండ్ చేయడంపై సీపీఐ శ్రేణులు విజయవాడలో సంబరాలు చేసుకున్నాయి. ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్. పి.హరినాథరెడ్డి, రాష్ట్రకార్యవర్గసభ్యులు దోనేపూడి శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శివారెడ్డి, డీహెచ్‌పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బుట్టి రాయప్ప పాల్గొన్నారు.

ఆ దగ్గు మందులు వాడొద్దు

డబ్ల్యూహెచ్‌ఓ సూచన



జెనీవా: భారత్‌కు చెందిన మారియన్ బయోటెక్ కంపెనీ తయారు చేసిన రెండు దగ్గు సిరప్‌లను వాడొద్దు అని ఉజ్బెకిస్తాన్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) సూచించింది. మారియన్ బయోటెక్ తయారు చేసిన వైద్య ఉత్పత్తులు నాణ్యతా ప్రమాణాలను స్పెసిఫికేషన్‌లను అందుకోవడంలో విఫలమయ్యాయని.. అందువల్లే వాటిని ఉపయోగించొద్దని వెల్లడించింది. ఆంబ్రోనాల్ డాక్-1 మాక్స్ సిరప్‌ల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని పేర్కొంది. దగ్గు మందు తాగి పిల్లలు చనిపోయారనే నివేదికలు వెలువడటంతో నోయిడాకు చెందిన ఫార్మా మారియన్ బయోటెక్ క్లౌడ్ కిందకు వచ్చింది. ఉజ్బెకిస్తాన్ రిపబ్లిక్ ఆరోగ్య శాఖ జాతీయ నాణ్యత నియంత్రణ ప్రయోగశాలల నాణ్యతా పరీక్షల్లో ఈ రెండు మందులకు ఆమోదం లభించలేదని డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొంది. ఆమోదయోగ్యం కాని మొత్తంలో డైథైలీన్ గ్లైకాల్ లేదా ఇథిలీన్ గ్లైకాల్ వంటివి మందులో ఉండటాన్ని గుర్తించినట్లు తెలిపింది. అనధికారిక మార్కెట్ల ద్వారా ఇతర దేశాలకు చేరి ఉండవచ్చు అని వెల్లడించింది. నాసిరకం ఉత్పత్తులు సురక్షితం కాదని.. వాటి ఉపయోగం, ముఖ్యంగా పిల్లలలో, తీవ్రమైన గాయం లేదా మరణానికి దారితీయవచ్చని డబ్ల్యుహెచ్‌ఓ హెచ్చరికలు జారీ చేసింది. డిసెంబరు 22న ఉజ్బెకిస్తాన్‌లో దగ్గు మందులు తాగి 18 మంది పిల్లలు చనిపోయారన్న విషయం విదితమే.

మూడు ముక్కల సీఎంకు భయపడాలా?

- కడవరకూ రాజకీయాల్లోనే
- పొత్తులపై సంకేతాలు
- ప్రాణత్యాగానికైనా సిద్ధం
- కుంటుపడిన రాష్ట్రాభివృద్ధి
- యువశక్తి సభలో పవన్

విశాలాంధ్ర-రణస్థలం(శ్రీకాకుళం): రాజు అసమర్థుడైతే రాజ్యం సగం నాశనం అయిపోతుందన్న నానుడి మన రాష్ట్ర ప్రస్తుత పరిస్థితికి అద్దంపడుతుందని, మూడు ముక్కల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి కుంటుపడిందని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. జనసేన పార్టీ శ్రీకాకుళం జిల్లా, రణస్థలంలో గురువారం ఏర్పాటు చేసిన యువశక్తి కార్యక్రమంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 2019 నుంచి రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, అసంపూర్తిగా పోలవరం, రాజధాని నిర్మాణాలు, నిరుద్యోగం పెరగడం, గుంతల మధ్య రోడ్లు, బెదిరింపు రాజకీయాలు, బూతులు తిట్టే మంత్రులే కనిపిస్తున్నారన్నారు. శ్రీకాకుళం జిల్లా, అభివృద్ధికి అమడదూరంలో ఉందని, ఉత్తరాంధ్ర ప్రాంతం వెనుకబాటుతనానికి నిదర్శనంగా నిలుస్తుందని ఇది పాలకుల పాపమేనన్నారు. ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి అందించడం ప్రభుత్వాల బాధ్యత అని, అది జరగకపోవడంతో ఈ ప్రాంతం నుంచి వలస వెళ్లిపోతున్నారని, తెలుగు ప్రజలు కష్టాలు చూసి, ఆ కష్టాల నుంచి ప్రజలను బయటపడేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని, నా మీద ఎన్ని దాడులు జరిగినా వ్యక్తిగతంగా ఎన్ని విమర్శలు చేసినా



కేవలం ప్రజల కోసమే భరిస్తున్నానని అన్నారు. ప్రతీ సన్నాసి మాటలు భరించేది బాధల్లో ఉన్నవారిని ఆదుకోవడం కోసమేనని, నన్ను ఎంత హింసించినా, బాధపెట్టినా ప్రజల పక్షాన నిలబడడం ఆగదని, నా చివరి శ్వాస ఉన్నంత వరకు రాజకీయాల్లోనే కొనసాగుతా, ప్రజల కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమన్నారు.

మూడు ముక్కల ప్రభుత్వం ..

మూడు ముక్కల ముఖ్యమంత్రి అంటూ సీఎం జగన్‌పై పవన్ కల్యాణ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను ఎవరినో తిట్టడానికి ఈ సభ పెట్టలేదన్నారు. మహా అయితే ప్రాణం పోతుందని, కానీ ఒక సత్యాన్ని బలంగా మాట్లాడిన వాడినవుతానని అన్నారు. తన కోసం కాకుండా , సాటి మనిషి కోసం జీవించే జీవితం గొప్పదని ఆయన అన్నారు. అధికారంలోకి రాగానే ప్రజల్ని బానిసల్లా చూసే వ్యక్తిత్వాలు తనకు చిరాకని పవన్ అన్నారు. సమాజం, దేశం కోసం ముందుకు రావాలని నిర్ణయించుకున్నానని స్పష్టం చేశారు. యువతలో కోపం వుంది, కానీ భయం కూడా వుందని ఆయన పేర్కొన్నారు. రాజకీయ నేతలకు భయపడనక్కర్లేదని పవన్ స్పష్టం చేశారు. ఇది కళింగాంధ్ర కాదని.. కలియబడే ఆంధ్ర అన్న ఆయన.. మీరు మౌనంగా వుంటే ఎలా అని

- మిగతా 2 లో

హిడ్మా తప్పించుకున్నాడు

బతికేవున్నాడని మావోయిస్టు పార్టీ ప్రకటన

విశాలాంధ్ర-చింతూరు (అల్లూరి జిల్లా): చత్తీస్‌గఢ్ దండకారణ్యంలో జరిగిన కాల్పులపై మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పేరున లేఖ విడుదల చేసింది. మావోయిస్టు అగ్రనేత మడావి హిడ్మా అలియాస్ సంతోశ్ చనిపోలేదని పేర్కొన్నది. హిడ్మా చనిపోయినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, ఆయన సురక్షితంగా ఉన్నాడని వెల్లడించింది. దక్షిణ బస్తర్ అటవీ ప్రాంతం కొండలపై పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు డ్రోన్‌లు, హెలికాప్టర్లతో దాడులు చేశాయని, గతేడాది ఏప్రిల్‌లోనూ వైమానిక బాంబు దాడి జరిగిందని ఆ లేఖ వివరించింది. 'మావోయిస్ట్ పార్టీ నాయకత్వం, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీని దెబ్బతీయాలని వందల సంఖ్యలో బాంబులు పేల్చారు.

రాత్రీ పగలు తేడా లేకుండా హెలికాప్టర్ల ద్వారా నిఘా పెట్టారు. వచ్చే ఎన్నికలలోపు మావోయిస్టులను ఏరివేస్తామని కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించారు. దీనిలో భాగంగానే తమపై ఈ దాడులు జరుగుతున్నాయి. ఈ భీకర దాడుల కారణంగా ప్రజలు పొలాలకు వెళ్లలేకపోతున్నారు. పాలకవర్గాలకు వ్యతిరేకంగా ప్రపంచంలోని అన్ని ప్రగతిశీల, ప్రజాస్వామ్య కూటములు ఏకం కావాలి' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

ఇదీ లోకం!

గంగిరెద్దుల వాడినేనమ్మా, పరిస్థితి బాలేదు. ఇద్దరిలో ఎవరో ఒకరే బతకగలిగే స్థితి!

ఆప్‌పై ఆగని బీజేపీ కుట్రలు

- రూ.164 కోట్ల జరిమానా
- కేజ్రీవాల్ లక్ష్యంగా చర్యలు సిసోడియా
- బ్యాంక్ ఖాతాలు స్వాధీనం చేసుకోవాలి: బీజేపీ



న్యూఢిల్లీ: వార్తాప్రతికలకు ఇచ్చే ప్రభుత్వ ప్రకటనలపై ఆప్, బీజేపీ మధ్య మాటలయుద్ధం కొనసాగుతోంది. ప్రభుత్వ అధికారులను చట్టవిరుద్ధంగా ఉపయోగించుకుంటూ తమ పార్టీని బద్నామ్ చేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆప్ ఆరోపించింది. బీజేపీ సైతం ఎదురుదాడికి దిగింది. ఆప్ బ్యాంక్ ఖాతాలు స్వాధీనం చేసుకోవాలని, నాయకుల ఆస్తులను అటాచ్ చేయాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వ ప్రకటనల పేరుతో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సొంత ప్రచారం చేసుకుందనే ఆరోపణలపై దిల్లీ రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిసిటీ (డీఐపీ) విభాగం తాజాగా స్పందించింది. ఈ మేరకు ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ చేసింది. గతేడాది ప్రకటనలకు వెచ్చించిన సొమ్ముతో పాటు పెనాల్టీ మొత్తంతో కలిపి రూ.163.62 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ఈ మొత్తాన్ని పది రోజుల్లోగా ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని నోటీసుల్లో పేర్కొంది. గడువులోగా చెల్లించకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కాగా, మార్చి 31, 2017 వరకు ప్రకటనల కోసం ఆప్ రూ. 99,31,10,053 ఖర్చు చేసినట్లు తెలిపింది. ప్రజాధనాన్ని పార్టీ అవసరాలకు వినియోగించుకున్నందుకుగాను జరిమానా, వడ్డీగా మరో రూ. 64,30,78,212 చెల్లించాలని నోటీసుల్లో పేర్కొంది. దీంతో మొత్తం రూ.163.62 కోట్లు ప్రభుత్వ ఖజానాకు జమచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ ప్రకటనల ముసుగులో దిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆరోపించారు. ప్రభుత్వ ప్రకటనలను ఆమ్ ఆద్మీ పార్టీ ప్రచారానికి ఉపయోగించుకుంటోందని, ఇందుకోసం గతేడాది రూ.97 కోట్లు ఖర్చు చేసిందని విమర్శించారు. ఈ

- మిగతా 2 లో

జనం పల్లెబాట

- సర్వత్రా సంక్రాంతి సందడి
- బస్సులు, రైళ్లు కిటకిట
- టోల్‌గేట్ల వద్ద వాహనాల భారీ క్యూ

2లో

చైనా, అంగోలా దౌత్యబంధానికి 40ఏళ్లు

పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్న అధ్యక్షులు

బీజింగ్: చైనా, అంగోలా దౌత్యబంధానికి 40ఏళ్లు అయ్యాయి. ఈ సందర్భంగా రెండు దేశాల అధ్యక్షులు జిన్‌పింగ్, జావో లారెన్‌కో శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చైనా, అంగోలా నిబద్ధతగల మిత్రదేశాలని జిన్‌పింగ్ అన్నారు. తమ ప్రయోజనాల దృష్టిలో పెట్టుకొని పని చేస్తున్నాయన్నారు. మంచి అవగాహనతో పరస్పరం సహకరించుకుంటూ ముందుకు సాగుతున్నాయని జిన్‌పింగ్ చెప్పారు. రెండు దేశాలకు అనేక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలు ఉండగా వాటితో సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. దౌత్యబంధానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిన్‌పింగ్ తెలిపారు. 40ఏళ్ల దౌత్య బంధాన్ని మరింత పటిష్టపర్చుకుంటూ ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. లారెన్‌కోతో కలిసి పని చేసేందుకు ఎప్పుడూ సిద్ధమేనన్నారు. తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పటిష్ట పర్చుకుంటూ కొత్త అధ్యాయాన్ని లిఖిస్తామన్నారు. లారెన్‌కో స్పందిస్తూ అంగోలా-చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతూ వచ్చాయన్నారు. అనేక అంతర్జాతీయ అంశాలకు సంబంధించి తమ రెండు దేశాల మధ్య అవగాహన ఉన్నట్లు తెలిపారు. తమ స్నేహ, సహకార సంబంధాలను మరింత బలపర్చుకుంటామని చెప్పారు. రెండు దేశాలకు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్‌లోనూ చర్యలు తీసుకుంటామన్నారు. సంయుక్తంగా పురోగతి, సుసంపన్నత, సమృద్ధికి కట్టుబడి ఉన్నామని అంగోలా అధ్యక్షుడు అన్నారు.

ఉక్రెయిన్‌లో రష్యా సైన్యానికి కొత్త కమాండర్

మాస్కో: ఉక్రెయిన్‌లో రష్యా సైన్యానికి కొత్త కమాండర్‌ను అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నియమించారు. రష్యా సాయుధ దళాల జనరల్ స్టాఫ్ చీఫ్ వాలెరీ గెరాసిమోవ్ కొత్త కమాండర్‌గా నియమితులైనట్లు ఆ దేశ రక్షణశాఖ ప్రకటించింది. మాజీ కమాండర్ సెర్గీ సురోవికిన్‌తో పాటు గ్రౌండ్ ఫోర్సెస్ కమాండర్ ఇన్ చీఫ్ ఒలెగ్, డిప్యూటీ చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్ అలెక్సీ కిమ్‌లు గెరాసిమ్ డిప్యూటీలుగా నియమితులైనట్లు పేర్కొంది. సాయుధ దళాలకు బలమైన మద్దతు అవసరమని, మరింత ప్రభావవంతమైన, నియంత్రణ కలిగిన కమాండర్ అవసరమని తెలిపింది. ప్రత్యేక సైనిక ఆపరేషన్‌లో భాగంగా విస్తృత చర్యలు చేపట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రష్యా వర్గాల సమాచారం.

పెరూలో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు

తాజాగా ఒకరి మృతి -34 మందికి గాయాలు

లిమా: పెరూలో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు మిన్నంటాయి. కుస్కో నగరంలో తాజాగా జరిగిన ఆందోళనల్లో ఒకరు మరణించగా 34 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఆరుగురు పోలీసులు, 28 మంది నిరసనకారులు ఉన్నట్లు మీడియా గురువారం వెల్లడించింది. అందరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. అల్లర్ల క్రమంలో కాల్పులు జరిపిన నేపథ్యంలో 50ఏళ్ల వ్యక్తి ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. అయితే భద్రతా సిబ్బంది వద్దనున్న హాండ్‌గన్స్‌లో బుల్లెట్లు లేవని, పెల్లెట్ తగిలి మరణం సంభవించి ఉండవచ్చు అని కుస్కో అటార్నీ పేర్కొన్నారు. ఇదిలావుంటే, జులియాకా విమానాశ్రయం సమీపంలో జరిగిన ఘర్షణల్లో మరణించిన వారికి స్థానికులు ఘనంగా నివాళులర్పించారు. జులియాకాలో శవపేటికలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈనెల 9, 10 తేదీల్లో జరిగిన నిరసనల్లో చనిపోయిన వారికి జులియాకా ప్రధాన కూడలి వద్ద నివాళులర్పించారు. ఆగేయ పెరూలోని జులియాకా విమానాశ్రయం సమీపంలో సోమవారం ఘర్షణల్లో 17 మంది మరణించారు. వారిలో ఇద్దరు యువకులున్నారు. తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబాలు డిమాండ్ చేశాయి. కాగా దేశాధ్యక్షురాలు దీనా బోలువార్టే రాజీనామాకు నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. మాజీ అధ్యక్షుడు పెడ్రో కాస్టిల్లో అరెస్టు జరిగిన తర్వాత వారంతా రోడ్లపైకొచ్చి నిరసన తెలుపుతున్నారు. గతేడాది డిసెంబరు నుంచి ఇప్పటివరకు 47 మంది నిరసనకారులు మరణించారు.

కామరూన్ బాధితులకు ఐరాస ఆర్థికసాయం

ఐరాస: కామరూన్‌లో సంభవించిన వరదలు, హింస బాధితులుగా ఉన్న వేలాది మందికి ఐక్యరాజ్యసమితి ఆపన్నహస్తం అందించింది. అత్యవసర నిధి కింద ఆరు మిలియన్ డాలర్లను విడుదల చేసింది. ఈ మేరకు ఐరాస అధికార ప్రతినిధి మార్టిన్ గ్రిఫిత్స్ తెలిపారు. గతేడాది వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని, వరదలు, హింస కారణంగా స్వరం కోల్పోయి రోడ్డున పడ్డారని, జీవనోపాధి లేక ఆహార అభద్రత వల్ల వారిపై తీవ్ర ప్రభావం పడిందని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గెటెర్రస్‌కు ప్రధాన అధికార ప్రతినిధి స్టీఫనే డుజార్రిక్ వెల్లడించారు. తాజా నిధులతో బాధితులకు ఆశ్రయం, ఆహారం, పౌష్టికాహారం అందుతుందని చెప్పారు. ఈ ఏడాది కామరూన్‌లో 2.4 మిలియన్ల మందికి సాయం చేయాలంటే 413 మిలియన్ డాలర్ల మానవతా సాయం అవసరమని అన్నారు.

జనం పల్లెబాట

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సంక్రాంతి పండగతో ఆర్టీసీ బస్సులు, రైళ్లు కిటకిటలాడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి పల్లెకు పెద్దఎత్తున ప్రయాణికులు పయనమయ్యారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లలో రద్దీ విపరీతంగా ఉంది. ఈనెల 12వ తేదీ నుంచి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో, తెలంగాణ-ఆంధ్ర రాష్ట్రాల మధ్య రాకపోకలు ఊపందుకున్నాయి. కిక్కిరిసిన ప్రయాణికులతో బస్సులు, రైళ్లు నడుస్తున్నాయి. ప్రయాణికుల రద్దీని గుర్తించి ఏపీఎస్‌ఆర్టీసీ, తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు, ముందస్తు రిజర్వేషన్లు చేసినప్పటికీ, ఎక్కడికక్కడే ప్రయాణికులతో అవి పూర్తిగా నిండిపోయాయి. ఏపీఎస్‌ఆర్టీసీ నుంచి 6,400 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి, వాటికి ఆన్‌లైన్ ద్వారా ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినప్పటికీ, ఇంకా బస్సుల కొరత ఏర్పడింది. ఏపీ నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులకు టికెట్ల ధరలు పెంచకుండా, సాధారణ ధరలతోనే ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది. రైళ్లల్లోనూ బెర్తులు కరువయ్యాయి. సంక్రాంతి పండుగతో హైదరాబాద్-విజయవాడ మధ్య రాకపోకలు భారీగా పెరిగాయి. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి కుటుంబ సమేతంగా పల్లెలకు ప్రయాణమయ్యారు. బస్సులు, రైళ్లల్లో రిజర్వేషన్లు దొరకని వారంతా ప్రైవేట్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. చాలా మంది కార్ల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. కొన్ని జిల్లాలకు బస్సులు తక్కువగా వేసినట్లు ప్రయాణికులు వాపోతున్నారు. హైదరాబాద్-విజయవాడ మధ్య జాతీయ రహదారి కిక్కిరిసిపోయింది. హైదరాబాద్ మార్గంలోని కీసర, చిలకల్లు టోల్‌గేట్ల వద్ద వాహనాలు బారులు తీరి గంటల కొద్దీ నిలిచిపోయి, ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రయాణికుల రద్దీని నియంత్రించడంలో అధికారుల విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. విజయవాడ నుంచి గుంటూరు మార్గంలోని కాజ, విజయవాడ నుంచి ఏలూరుకు వెళ్లే మార్గంలో రెండు టోల్ గేట్ల వద్ద వాహనాలు బారులు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

ప్రయాణికుల పడిగాపులు

విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ప్రాంగణం, రైల్వేస్టేషన్లు ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన సీట్లు పూర్తిగా నిండిపోవడంతో, చాలా మంది పడిగాపులు పడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ బస్‌స్టేషన్‌కు, రైల్వేస్టేషన్‌కు వచ్చిన వారంతా పల్లెలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వారి గమ్యస్థానం కోసం వెళ్లాల్సిన బస్సులు నిండిపోవడంతో తర్వాత బస్సుల కోసం వేచిస్తున్నారు. బస్సులలోను, రైళ్లలోను గంటల కొద్దీ ప్రయాణికులు నిలబడి రాకపోకలు సాగిస్తున్నారు. విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి బస్‌స్టేషన్‌కు, బస్‌స్టేషన్ నుంచి విజయవాడకు రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు రాకపోకలు సాగించడంతో ట్రాఫిక్‌కు సమస్య తలెత్తుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా విజయవాడలో షాపింగ్ చేస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంది. విజయవాడ బందరురోడ్డు, ఏలూరురోడ్డులపైనా సాధారణ రోజుల కంటే ప్రయాణికుల రద్దీ పెరిగింది. వివిధ నగరాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలిరావంతో పల్లెలు కళకళలాడుతున్నాయి. ఇప్పటివరకు జనసందడి లేకుండా నిర్మానుష్యంగా ఉండే పల్లెల్లోనూ వారి బంధువులు, కుటుంబ సభ్యుల రాకతో కొంత సందడి వాతావరణం నెలకొంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏపీఎస్‌ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాలు, జిల్లా కేంద్రాల నుంచి పల్లెలకూ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. వాటికి తోడుగా వివిధ పుణ్యక్షేత్రాలకు ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులను వేసింది. శ్రీశైలం వెళ్లే భక్తుల సందర్శనార్థం, టికెట్ రిజర్వేషన్ చేసుకున్న వారికి దర్శన టికెట్లు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ రద్దీ పండగ అనంతరం కూడా కొనసాగే అవకాశం ఉంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సులు, రైళ్లను నడపాలి.

ఆప్‌పై ఆగని బీజేపీ కుట్రలు

(మొదటిపేజీ తరువాయి)

మొత్తాన్ని పార్టీ అధినేత కేజ్రీవాల్ నుంచి వసూలు చేయాలని సంబంధిత అధికారులను ఎల్జీ సక్సేనా ఆదేశించారు. ఎల్జీ ఆదేశాల మేరకు తాజాగా ఆప్‌కు డీఐపీ నోటీసులు జారీ చేసింది.

బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక చర్యలు: సిసోడియా

ఆప్‌కు జరిమానా విధించడంపై ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా తీవ్రంగా స్పందించారు. ఢిల్లీ ప్రభుత్వం, మంత్రులు లక్ష్యంగా బీజేపీ రాజ్యాంగ విరుద్ధంగా అధికారులను తమ నియంత్రణలో ఉంచుకుంటుందని తీవ్రంగా విమర్శించారు. అదేసమయంలో రూ.163.62 కోట్ల జరిమానా చెల్లించాలంటూ ఆదేశాలు జారీ చేసిన డీఐపీకి ఆప్ జాతీయ కార్యదర్శి పంకజ్ కుమార్ గుప్తా లేఖ రాశారు. డీఐపీ చర్యను నియంతృత్వమైనదిగా, మూర్ఖత్వంతో కూడినదిగా గుప్తా అభివర్ణించారు. ఆ ప్రకటనల కాపీలు అందజేయాలని గుప్తా కోరారు. సిసోడియా గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీ వార్తాపత్రికల్లో బీజేపీ ముఖ్యమంత్రులు ఇచ్చిన ప్రకటనలను కూడా ప్రచురించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ముఖ్యమంత్రులు ఇచ్చిన ప్రకటన ఖర్చులను కూడా రికవరీ చేస్తారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మంత్రులు లక్ష్యంగా అధికారులను దుర్వినియోగం చేయడాన్ని బీజేపీ ఆపాలని డిమాండ్ చేశారు. తాము ఇచ్చిన ప్రకటనలు చట్టవిరుద్ధమైనవి ఏమిటో చెప్పాలని, ఆ ప్రకటనలు తమకు ఇవ్వాలని డీఐపీ కార్యదర్శిని కోరారు. ఢిల్లీ అధికారులను బీజేపీ చట్టవ్యతిరేకంగా ఉపయోగించుకుంటుందని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వ ప్రకటనలను పార్టీ ప్రకటనలుగా చూపుతారా అని నిలదీశారు. మరోవైపు, ఆప్ బ్యాంకు ఖాతాలు స్వాధీనం చేసుకోవాలని, నాయకుల ఆస్తులు అటాచ్ చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఆప్ రాజకీయ ప్రచారం కోసం ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించింది. రూ.163 కోట్లు చెల్లించాలని డీఐపీ నోటీసు జారీ చేసిన తర్వాత ఆప్‌పై బీజేపీ విరుచుకుపడింది. ప్రభుత్వ నిధులతో ఆప్, దాని నాయకులు రాజకీయ ప్రచారం చేసుకుంటున్నారని చెప్పింది. ఆ మొత్తాన్ని తిరిగి వసూలు చేయాలని కోరింది. పన్ను చెల్లింపుదారుల డబ్బును ఆప్ వృథా చేస్తోందని పేర్కొంది.

యువశక్తి దేశానికి చోదకశక్తి: మోదీ

హుబ్లీ(కర్ణాటక): యువశక్తి భారతదేశానికి చోదక శక్తి అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గురువారం ఇక్కడ 26వ జాతీయ యువజనోత్సవాలను ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ప్రధాని ప్రసంగించారు. దేశ ఆర్థికవృద్ధి యువతకు గొప్ప అవకాశాలను కల్పిస్తుందన్నారు. బొమ్మల నుంచి పర్యాటకం, రక్షణ నుంచి డిజిటల్ వరకు ఏ రంగంలోనైనా దేశం ప్రపంచవ్యాప్తంగా ప్రధానంగా మారుతోందని అన్నారు.

మారియన్ బయోటెక్‌లో మళ్లీ తనిఖీలు

- మందుల తయారీ లైసెన్సు రద్దు
- డబ్ల్యూహెచ్‌ఓ హెచ్చరికతో రంగంలోకి కేంద్ర-రాష్ట్ర డ్రగ్ అధికారులు

నోయిడా: ఉజ్బెకిస్తాన్‌లో చిన్నారుల మరణానికి కారణంగా భావించే భారత్‌లోని నోయిడాకు చెందిన మారియన్ బయెటెక్ కంపెనీ తయారు చేసే మందులు అంబ్రోనాల్, డాక్-1మ్యాక్స్ సిరప్‌లపై నిషేధం కొనసాగుతోంది. ఈ మందుల తయారీని నిషేధిస్తూ లైసెన్సును కేంద్రప్రభుత్వం రద్దు చేయగా దానిని పునరుద్ధరించలేదని డ్రగ్ అధికారులు గురువారం తెలిపారు. కంపెనీ తయారీ కేంద్రాల్లో గురువారం మరోమారు తనిఖీలు నిర్వహించి, మందుల నమూనాలు సేకరించి పరీక్షలకు పంపినట్లు వెల్లడించారు. వాటి నివేదికల కోసం వేచివున్నామని చెప్పారు. అంబ్రోనాల్, డాక్-1మ్యాక్స్ సిరప్‌లను ఉజ్బెకిస్తాన్‌లో వినియోగించవద్దని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) హెచ్చరికలు జారీ చేసిన క్రమంలో ఉత్తరప్రదేశ్ డ్రగ్ విభాగం, కేంద్ర బృందం తాజాగా తనిఖీలు చేపట్టింది. గతేడాది డిసెంబరులో మారియన్ బయోటెక్ తయారీ కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. మందుల తయారీని తాత్కాలికంగా నిలిపివేశారని గౌతం బుద్ధనగర్ డ్రగ్ ఇనస్పెక్టర్ వైభవ్ బబ్బర్ తెలిపారు. నేటికీ మందుల తయారీకి సంబంధించి కంపెనీ లైసెన్సుపై సస్పెన్షన్ ఉన్నదన్నారు. డిసెంబరు 29న తొలుత ఈ ఆదేశాలు ఇవ్వగా ఈనెల 10న రాతపూర్వకంగా జారీ చేశారన్నారు. మారియన్ బయెటెక్ కంపెనీ డాక్-1 మాక్స్, అంబ్రనోల్ మందులను భారత్‌లో విక్రయించదని, కేవలం ఉజ్బెకిస్తాన్‌కు పంపుతుందని బబ్బర్ తెలిపారు. 45రోజుల్లో లక్ష డాక్-1 మ్యాక్స్ సిరప్‌లు ఎగుమతయ్యాయన్నారు.

30,31 తేదీల్లో బ్యాంకుల సమ్మె

యూఎఫ్‌బీయూ పిలుపు

ముంబై: దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేయనున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 30, 31 తేదీల్లో సమ్మెకు బ్యాంకు యూనియన్ల వేదిక యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) పిలుపునిచ్చిందని అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (ఏఐబీఈఏ) ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం తెలిపారు. గురువారం ముంబైలో జరిగిన యూఎఫ్‌బీయూ సమావేశంలో ఈ నిర్ణయం జరిగినట్లు వెల్లడించారు. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)కు ఎన్ని లేఖలు రాసినా తమ డిమాండ్లపై స్పందన రాకపోవడంతో జనవరి 30, 31 తేదీల్లో సమ్మె చేపట్టాలని నిర్ణయించామని వెంకటాచలం తెలిపారు. ఐదు రోజుల పనిదినాలు, పింఛన్ సవరణ, జాతీయ పింఛన్ పథకం (ఎన్పీఎస్) రద్దు, వేతన సవరణ డిమాండ్‌ల చార్టర్‌పై తక్షణ చర్చలు, అన్ని విభాగాల్లో సముచిత స్థాయిలో నియామకాలు చేపట్టడం తదితర డిమాండ్లు ఉన్నాయని ఆయన చెప్పారు.

జీవో నిలిపివేతపై అచ్చెన్న హర్షం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జీవో ఒకటిని రాష్ట్ర హైకోర్టు సస్పెండ్ చేయడంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇకనైనా రాజారెడ్డి రాజ్యాంగాన్ని పక్కనబెట్టి అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని గురువారం ఓ ప్రకటనలో హితవు పలికారు. ప్రజలపక్షాన పోరాడుతున్న ప్రతిపక్షనేతలపై కక్షసాధింపు కోసం తెచ్చిన ఇలాంటి జీవోలు న్యాయస్థానాల్లో నిలబడవని సైకో సీఎం గుర్తించాలని పేర్కొన్నారు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా పాలన సాగించిన హిట్లర్, ముస్సోలిని నియంతలు కాలగర్భంలో కలిసిపోయారని గుర్తుచేశారు. అధికారమదంతో మితిమీరి ప్రవర్తిస్తున్న జగన్ రెడ్డి సైతం చరిత్రపుటల్లో మాయనిమచ్చగా మిగిలిపోక తప్పదని పేర్కొన్నారు.

ఢిల్లీకి తమిళనాడు గవర్నరు వివాదం

రాష్ట్రపతికి స్టాలిన్ ప్రభుత్వం ఫిర్యాదు

న్యూఢిల్లీ: తమిళనాట గవర్నరు ఆర్‌ఎన్ రవి, డీఎంకే ప్రభుత్వం మధ్య వివాదం తారస్థాయికి చేరింది. గవర్నరును వెనక్కి పిలవాలని డిమాండ్ చేస్తున్న ఎంకే స్టాలిన్ ప్రభుత్వం తాజాగా గురువారం ఈ వివాదాన్ని ఢిల్లీకి తీసుకెళ్లింది. గవర్నరుపై స్టాలిన్ ప్రభుత్వం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఫిర్యాదు చేసింది. వినతిపత్రం అందజేసింది. అయితే, రాష్ట్రపతికి అందజేసిన వినతిపత్రంలోని అంశాలు వెల్లడికాలేదు. డీఎంకే పార్లమెంటరీ పార్టీ నాయకుడు టీఆర్ బాలు ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ న్యాయశాఖమంత్రి ఎస్.రఘుపతి నాయకత్వంలో ప్రతినిధి బృందం రాష్ట్రపతిని కలిసినట్లు చెప్పారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వయంగా రాసిన లేఖను వినతిపత్రంగా రాష్ట్రపతికి అందజేసినట్లు వెల్లడించారు. అయితే, ఆ లేఖ సారాంశమేమిటని విలేకరులు పదేపదే అడిగినా బాలు సమాధానం చెప్పలేదు. లేఖలో ఏముందో సీఎంకు మాత్రమే తెలుసునని పేర్కొన్నారు. సీఎం స్టాలిన్ రాసిన లేఖను సీల్డ్ కవరులో రాష్ట్రపతికి అందజేసినట్లు బాలు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్టాలిన్ రాసిన లేఖను రాష్ట్రమంత్రి రాష్ట్రపతికి అందజేశారన్నారు. సంప్రదాయాల నుంచి గవర్నరు పక్కకుపోవడం, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇష్టానుసారం వ్యవహరించడం వంటి అంశాలు లేఖలో ఉండవచ్చని సూచనప్రాయంగా చెప్పారు. 'అది ముమ్మాటికీ ముఖ్యమంత్రి స్టాలిన్, రాష్ట్రపతి ముర్ముకు సంబంధించిన అంశం. అందులో అంశాలు మాకు తెలియదు. స్టాలిన్ చెప్పింది మేము చేశాం. ప్రభుత్వం తరపున రాష్ట్రపతికి లేఖ అందజేశాం' అని బాలు వివరించారు. వినతిపత్రాన్ని పరిశీలించి సరైన చర్య తీసుకోవాలని రాష్ట్రపతికి విన్నవించామన్నారు. అసెంబ్లీలో సోమవారం నాటి సంప్రదాయబద్ధ ప్రసంగం నుంచి గవర్నరు పక్కకు వెళ్లారు.

గవర్నరు ప్రసంగానికి వ్యతిరేకంగా సీఎం స్టాలిన్ తీర్మానం ప్రవేశపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం, గవర్నరు మధ్య ఇప్పటికే కొనసాగుతున్న ఘర్షణ మరింత తీవ్రమైంది. గవర్నరుకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తున్నప్పటికీ డీఎంకే సహా దాని మిత్రపక్షాలు సైతం ఆర్‌ఎన్ రవిని తప్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. రవిని గవర్నరు పదవి నుంచి తప్పించాలని డీఎంకే నాయకత్వంలోని లౌకిక ప్రగతిశీల కూటమి నవంబరులో రాష్ట్రపతి ముర్ముకు ఫిర్యాదు చేసింది. రాజ్యాంగబద్ధంగా చేసిన ప్రమాణాన్ని రవి ఉల్లంఘిస్తున్నారని ఆరోపించింది.

వాహనాలపై పన్ను పెంపు వెనక్కి తీసుకోవాలి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రవాణా వాహనాలపై త్రైమాసిక పన్ను పెంపును తక్షణమే ఉపసంహరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వలన డీజిల్ ధరలు పెరగడం, కరోనాతో కోలుకోలేని దెబ్బతినడం వలన రవాణా రంగం కుదేలైందనీ, యేటా టోల్‌గేట్ల ధరలు 15శాతం పెంచుతున్నారని విమర్శించారు. కిస్తీలు కట్టలేక, కిరాయిలు రాక, వాహనాల నిర్వహణ ఖర్చులు పెరిగి, లారీ ఓనర్లు దివాలా తీసే స్థితిలో ఉన్నారని, జీవో నంబరు-21తో రాష్ట్రంలోని చలానాలు, జరిమానాలు మూడు రెట్లు పెరిగాయని పేర్కొన్నారు. గ్రీన్‌ట్యాక్స్‌ను తగ్గించకపోగా ఇప్పుడు త్రైమాసిక పన్నును 30 శాతం పెంచడం మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లేనని ఆరోపించారు.

కరోనా సమయంలో త్రైమాసిక పన్నులకు రాయితీలిస్తే మన రాష్ట్రంలో పన్నులు పెంపుదల చేయడం గర్హనీయమని తెలిపారు. రవాణా వాహనాలపై పన్నులు పెంచడమంటే అంతిమంగా ప్రజలపై భారం వేయడమేనని పేర్కొన్నారు.

రద్దు చేయాల్సిందే!

ఏఐటీయూసీ రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాజకీయపార్టీల ర్యాలీలు, బహిరంగసభలపై ఆంక్షలు విధిస్తూ ఈ నెల 2వ తేదీ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబరు 1ని వ్యతిరేకిస్తూ గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యాన పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎక్కడికక్కడ జీవో ప్రతులను దగ్ధం చేస్తూ ప్రభుత్వ నియంతృత్వ విధానాలను ఎండగట్టారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రశ్నించే గొంతుకలు లేకుండా చేసేందుకే జీవో నం.1 తీసుకువచ్చారని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు అధ్యక్షతన దాసరి భవన్ వద్ద జీవో ప్రతులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు మాట్లాడుతూ ప్రభుత్వాలు నిర్వహించే ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపే అవకాశం లేకుండా, ప్రశ్నించే హక్కు లేకుండా చేయటానికి రాజ్యాంగానికి వ్యతిరేకంగా జీవో తెచ్చారని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా తీసుకొచ్చే ఇటువంటి జీవోలు న్యాయసమీక్షకు నిలబడవని, తక్షణమే ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జీవో రద్దు అయ్యే వరకు పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ జగన్ నియంతృత్వ విధానాలకు ఈ జీవో పరాకాష్టగా పేర్కొన్నారు. ప్రజానిరసనను వినిపించే గొంతుకను నొక్కడమే దీని ఉద్దేశమని, దీనిని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోకుంటే ప్రజాగ్రహం చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు కేఆర్.ఆంజనేయులు, ముఠా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వియ్యపు నాగేశ్వరరావు, హాకర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొట్టు రమణ, సీపీఐ నగర నాయకులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరరావు, ఏఐటీయూసీ నాయకులు నాగేశ్వరరావు, నాగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సీహెచ్.శ్రీరామచంద్రమూర్తి, పోర్టర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బి.రాంబాబు, మన్నెం సుబ్బయ్య, బెవర శ్రీనివాసు, ఎం.కొండలరావు, ముఠా కార్మిక సంఘం శాఖ పార్టీ కార్యదర్శి బత్తుల తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

జీఓ ఒకటిని రద్దు చేయాలి-వెలుగూరి రాధాకృష్ణమూర్తి

రాజ్యాంగ వ్యతిరేక జీఓ నంబరు వన్‌ని తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు జీఓ నంబరు ఒకటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గుంటూరు మల్లయ్యలింగం భవన్ నుంచి భగత్‌సింగ్ విగ్రహం వరకు గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. జీఓ ప్రతులను దహనం చేశారు. అనంతరం వెలుగూరి మాట్లాడుతూ పోలీస్ చట్టం సెక్షన్ 30, సెక్షన్ 144లతో పాటు ఐపీసీ, సీఆర్‌పీసీ వంటి చట్టాలు ఉండగా ఇంకా ఈ జీఓ అవసరమేముందని ప్రశ్నించారు. ప్రజా నిరసనను గ్రహించి ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞతతో జీఓని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేడా హనుమంతరావు, కోట మాల్యాద్రి, బందెల రవికుమార్(మున్సిపల్), నగర నాయకులు జి.సురేశ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో

ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేలా ప్రభుత్వం విడదల చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ బాపట్ల జిల్లా ప్రధానకార్యదర్శి బత్తుల శ్యామ్యూల్

విజయవాడలో...

కోరారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ కూడలి వద్ద గురువారం జీవోను రద్దు చేయాలని నిరసన ధర్నా చేపట్టి జీవో ప్రతులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జేబీ శ్రీధర్, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు సన్నమూరు శ్రీనివాసరావు, మామిడి బత్తుల అశోక్, సివిల్ సప్లైస్ నాయకులు ఉమామహేశ్వరరావు, ముఠా నాయకుల ముత్తిరెడ్డి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఆటో యూనియన్ నాయకులు షేక్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలో

ఏలూరు మెయిన్ బజార్లో జీవో కాపీలను దగ్ధం చేశారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, జట్లు లాగుడు బండ్ల ముఠా కార్మిక సంఘం అధ్యక్షులు పుప్పాల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు. ఉండిలో ఏఐటీయూసీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు, కలిశెట్టి వెంకట్రావు, సనపల శ్రీను తదితరులు పాల్గొన్నారు. చింతలపూడి బోసుబొమ్మసెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కంచర్ల గురవయ్య, పుప్పాల సత్యనారాయణ పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం ఆర్టీసిడిపో వద్ద ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమసుందర్, ఓసూరి వీర్రాజు, కళింగ లక్ష్మణరావు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు. నరసాపురం మున్సిపల్ కార్యాలయం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు, ఆరేటి మృత్యుంజయరావు, నెక్కంటి క్రాంతి కుమార్, నీలాపు నరసింహారావు పాల్గొన్నారు. భీమవరంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎ.పి.మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కిలారి మల్లేశ్వరరావు పాల్గొన్నారు. నూజివీడు పెద్దగాంధీబొమ్మ సెంటరులో ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకటరామారావు, బత్తుల వెంకటేశ్వరరావు,సీహెచ్ పుల్లారావు పాల్గొన్నారు.తణుకు నరేంద్ర కూడలి వద్ద జీవో కాపీ దగ్ధం కార్యక్రమంలో బొద్దాని నాగరాజు, టీ. అప్పలస్వామి, ఎ. వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో

కాకినాడలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు బొబ్బిలి శ్రీనివాసరావు ఆధ్వర్యాన మున్సిపల్ ఆఫీస్ బాల భవన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, పెద్దిరెడ్డి సత్యనారాయణ(పిఎస్), తుపాకుల లక్ష్మీనారాయణ, కామిరెడ్డి బోడకొండ, బొబ్బిలి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నిడదవోలులో జీవో ప్రతులను దగ్ధం చేసిన కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖా భాస్కరరావు, మాముడూరి నాగేంద్రవర ప్రసాద్, తూరుగోపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు భయపడాలా?

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు.

కడ వరకూ రాజకీయాల్లోనే ఉంటా...

రణస్థలంలో మాట ఇస్తున్నా.. కడ శ్వాస వరకు రాజకీయాలను వదలను. పూర్తి స్థాయి రాజకీయ నాయకులం అని కొందరు చెబుతారు. ఈ దేశంలో పూర్తి స్థాయి రాజకీయ నాయకులు ఎవరు ఉన్నారు? అందరూ వ్యాపారాలు, కాంట్రాక్టులు చేస్తూనే రాజకీయాల్లో ఉన్నారు. కపిల్ సిబల్, చిదంబరం లాంటి వారు కూడా న్యాయవాద వృత్తిలో కొనసాగుతూనే రాజకీయాల్లో ఉన్నారు. అందుకే నేను కూడా రాజకీయాల్లో ఉంటూనే సినిమాలు చేస్తున్నా. పార్టీని నడిపేంత డబ్బు వస్తే సినిమాలు వదిలేందుకు సిద్ధమని పవన్ ప్రకటించారు.

పొత్తులపై సంకేతాలు

ఒంటరిగా ఎన్నికలకు వెళ్లి వీర మరణాలు అక్కర్లేదని పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒంటరిగా ఉండి గెలుస్తానంటే తనకు ఎవరి పొత్తులు అక్కర్లేదు...మీరు అండగా

వుంటానని గ్యారెంటీ ఇస్తారా అని పవన్ సభకు హాజరైనవారిని ప్రశ్నించారు. ఇప్పుడు ఓకే అని చెప్పి ఎన్నికలు అవ్వగానే మా వాడు, మా కులం అని అంటే కుదరదని ఆయన తేల్చిచెప్పారు. తాను మిమ్మల్ని కుటుంబం అనుకున్నానని, తన ఫ్యామిలీయే వదిలేస్తే తాను ఏం చేయాలని పవన్ ప్రశ్నించారు. కొన్నిసార్లు ప్రత్యర్థులని కూడా కలుపుకునిపోవాలని ఆయన వ్యాఖ్యానించారు. అందరినీ హింసించే ఒక్కడిని ఎదుర్కోవాలంటే అందరూ కలవాలని పవన్ అన్నారు. గౌరవం తగ్గకుండా , మనం లొంగిపోకుండా కుదిరితే కలిసి పోటీ చేస్తాం... లేదా ఒంటరిగానే వెళ్తామని పొత్తులపై ఆయన తేల్చేశారు. ఓడిపోతే ఇంట్లో కూర్చొన్నాం... బయటికొచ్చాం తిరిగామని పవన్ వ్యాఖ్యానించారు. రాజకీయం ఎంత సేపటికీ రెడ్డి, కమ్మ, కాపు కులాల చుట్టూనే తిరుగుతున్నాయనిచ ఇంకా ఎన్నో కులాలు ఉన్నాయని ఆయన తెలిపారు.

ఉద్యమ కార్యాచరణను అమలు చేయండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: జగనన్న కాలనీల్లో ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను సత్వరమే పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పజెప్పాలని, రైతాంగ సమస్యలు, ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు పరిరక్షణ, నీటి పారుదల పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం తదితర సమస్యలపై ఈ నెల 17 నుండి ఫిబ్రవరి 14 వరకు ఉద్యమాలకు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

విజయవాడ దాసరి భవన్‌లో గురువారం బుట్టి రాయప్ప అధ్యక్షతన జరిగిన ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. జనవరి 17 నుండి 30వ తేదీవరకు జగనన్న ఇళ్ల లబ్ధిదారులను కలిసి అర్జీలపై సంతకాలు సేకరించడం, ఫిబ్రవరి 6న జిల్లా కేంద్రాలలో సదస్సులు, కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించడం, ఫిబ్రవరి 22న జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్ల లబ్ధిదారులతో మహాధర్నా నిర్వహించాలన్నారు. జనవరి 20 నుండి ఫిబ్రవరి 4 వరకు జరిగే యువజన, విద్యార్థుల బస్సుయాత్రను జయప్రదం చేయాలని చెప్పారు. జనవరి 23, 24 తేదీలలో విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం రెవెన్యూ డివిజన్లలోనూ, 27న కలెక్టరేట్‌ల వద్ద దీక్షలు జరపాలని, విశాఖలో జరిగే పోరాటానికి పూర్తి సహకారం అందించాలన్నారు. ఫిబ్రవరి 8 నుండి 14వరకు రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను సందర్శించాలని సూచించారు. ఇచ్చిన కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ పాల్గొన్నారు. భవిష్యత్ కర్తవ్యాలపై జిల్లా కార్యదర్శి సీహెచ్. కోటేశ్వరరావు వివరించారు. సీపీఐ జిల్లా డిప్యూటీ సెక్రటరీ దోనెపూడి శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రసంగించారు.

ఏప్రిల్ 14కి అంబేద్కర్ విగ్రహం పూర్తికి చర్యలు

మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేశ్ అన్నారు. ఏప్రిల్ 14 కల్లా దీనిని పూర్తి చేయాలనే కృతనిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. విజయవాడ స్వరాజ్ మైదానం (పీడబ్ల్యూడీ గ్రౌండ్)లో శరవేగంగా జరుగుతున్న విగ్రహ పనులను మంత్రులు గురువారం పరిశీలించారు. నాగార్జున మాట్లాడుతూ విజయవాడలో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఖరీదైన ప్రాంతంలో జగన్ ప్రభుత్వ నేతృత్వంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టుకు రూ.300 కోట్లకుపైగా ఖర్చు అవుతుందని, ఇప్పటికే రూ.248 కోట్లు వెచ్చించామని తెలిపారు. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం అంబేద్కర్ విగ్రహాన్ని పూర్తి చేస్తున్నామని, ఇందుకు అందరూ సహకరించాలని మంత్రి కోరారు. ఆదిమూలపు సురేశ్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెద్దపీట వేయడం సీఎం జగన్ ఆకాంక్ష అని తెలిపారు. మంత్రివర్గంలో 70శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల వారినే తీసుకుని సామాజిక న్యాయాన్ని అమలు చేసిన ముఖ్యమంత్రి దేశ చరిత్రలో ఎవరూ ఉండరన్నారు. పురపాలక పట్టణాభివృద్ధి శాఖ, మౌలిక సదుపాయాల కార్పొరేషన్, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ అందరి అనుసంధానంతో సమన్వయంతో పనులు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

సీఎం, సీఎస్‌లతో సోమేష్‌కుమార్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలంగాణ మాజీ సీఎస్ సోమేష్ కుమార్ గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని వేర్వేరుగా కలిశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో సోమేష్‌కుమార్‌ను ఏపీకి కేటాయించడం వల్ల ఆ రాష్ట్రంలోనే విధులు నిర్వహించాలని కోర్టు పేర్కొంది. ఇదే సమయంలో తెలంగాణలో కొనసాగింపును రద్దు చేసింది. ఈ మేరకు ఏపీ సీఎస్‌కు రిపోర్ట్ చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్రానికి చేరుకున్న సోమేష్‌కుమార్ సీఎస్ జవహర్‌రెడ్డిని, సీఎంను కలిశారు. సీఎంకు ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మీడియాతో సోమేష్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీకి వచ్చాన న్నారు. వీఆర్ఎస్‌పై ఇంకా నిర్ణయం తీసుకోలేదనీ, కుటుంబ సభ్యులతో చర్చించాక ఆలోచిస్తానని చెప్పారు. ఏ బాధ్యతలు ఇచ్చినా తాను నిర్వహి స్తానన్నారు. అయితే సోమేష్‌కుమార్ విధులు నిర్వహిస్తారా?, లేక రిపోర్ట్ చేసిన కొంత కాలానికి వీఆర్ఎస్ తీసుకుంటారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

మోదీ పాలనలో దేశాభివృద్ధి శూన్యం

సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-విశాఖ: బీజేపీ పాలనలో అభివృద్ధి కుంటుపడుతోందని, దేశం ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. సీపీఐ విశాఖ జిల్లా సమితి సమావేశం గురువారం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మోదీ పాలనలో దేశం మునుపెన్నడూ లేనివిధంగా అన్ని రంగాల్లో వెనుకబడిందని, సంపన్న వర్గాల ఆస్తుల రోజురోజుకీ పెరుగుతున్నాయని, పేదవారు మరింత పేదరికంలోకి వెళుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల సమయంలో బీజేపీ చేసిన వాగ్దానాలు నేటికీ అమలు కాలేదని అన్నారు. ఇటీవల కొన్ని రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ వ్యతిరేక పవనాలు వీస్తున్నట్లు స్పష్టమైందని, స్వయానా ప్రధాని ప్రచారం చేసినా ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్‌లో ఆ పార్టీ ఓడిపోయిందని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ వ్యతిరేక కూటమి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు.

పాలకులకు తొత్తులుగా అధికారులు

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వానికి తొత్తులుగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరిస్తోందని సత్యనారాయణ మూర్తి మండిపడ్డారు. ఒకప్పుడు రాయలసీమ ప్రాంతానికే పరిమితమైన ఈ ధోరణి నేడు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించిందని విమర్శించారు. ప్రతిపక్షాలను అణగదొక్కడమే ధ్యేయంగా వైసీపీ పాలన సాగిస్తోందన్నారు. సంక్షేమ పథకాల ముసుగులో అరాచక పాలనకు శ్రీకారం చుట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన హక్కులకు అనుగుణంగా ప్రభుత్వం వ్యవహరించడం లేదని సొంత అజెండాలను అమలు చేస్తూ సామాన్యుల నడ్డివిరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అనేక మందికి సంక్షేమ కార్యక్రమాలు అమలు కావడం లేదని అన్నారు. బీజేపీ ప్రభావం రాష్ట్రంలో పెద్దగా లేదన్నారు. బీజేపీతో సంబంధం లేదంటూనే వైసీపీ ఆ పార్టీతో సంబంధాలు నెరుపుతున్నదని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వచ్చిందని, అయితే ఎవరు ఎటూ వైపు వెళ్తారో స్పష్టత లేదని తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్రంలో ఏమేర ప్రభావం చూపుతుందో వేచిచూడాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

తీర్మానాలు...

జనవరి 17 నుండి 30 వరకు జగనన్న ఇళ్ల లబ్ధిదారులను కలిసి అర్జీలపై సంతకాల సేకరణ, ఫిబ్రవరి 3 న లబ్ధిదారులతో జిల్లా కేంద్రంలో సదస్సు నిర్వహించి జిల్లా కలెక్టర్ కు విజ్ఞాపన పత్రం అందజేత, ఫిబ్రవరి 22 న విజయవాడలో రాష్ట్ర స్థాయి సదస్సు, విశాఖ ఉక్కు పరిరక్షణకు జనవరి 23, 24 తేదీలల్లో ఆర్‌డీఓ కార్యాలయాల వద్ద ధర్నాలు, 25న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా, 30న కార్మికులు తలపెట్టిన పోరాటానికి సంఘీభావం, జనవరి 14 న భోగి మంటల్లో జీఓ నం.1 ను తగలబెట్టడం, జనవరి 26న రాజ్యాంగ పరిరక్షణ, జనవరి 30 న లౌకికవాద పరిరక్షణ దినంగా పాటించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఏజే స్టాలిన్, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ, సమితి సభ్యులు, శాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శివయ్య సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-అనకాపల్లి: ప్రముఖ న్యాయవాది, సీపీఐ నేత శివయ్య సేవలు మరువలేనివని వక్తలు నివాళి అర్పించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కోఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్ సంయుక్తంగా శివయ్య సంస్మరణ సభ వై.విజయ కుమార్ హాలులో సాయిలక్ష్మణ్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, సీనియర్ న్యాయవాది, కార్పొరేటర్ స్టాలిన్ ప్రసంగిస్తూ శివయ్య మరణించినా ప్రజల హృదయాలలో చిరంజీవిగా ఉన్నారన్నారు. పేద, బలహీనవర్గాలకు ఉచిత న్యాయ సేవలందించిన శివయ్య వ్యక్తిత్వం ఆదర్శప్రాయమన్నారు. ఇస్కఫ్, ఐఏఎల్ జిల్లా కార్య దర్శిగా సేవలందించిన శివయ్య...ఇతర సంఘాలకూ నాయకుడిగా పనిచేసి అందరి మన్ననలు పొందారన్నారు. సీపీఐ నాయ కుడిగా గోవిందరావుతో కలిసి పనిచేశారని కొనియాడారు. బహుముఖ ప్రజ్ఞాశాలి శివయ్య అని కొనియాడరు. లా ప్రొఫెసర్ మళ్ల సూకరాజు, ఏఎంఏఎల్ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ సూకరాజు, ఇస్కఫ్, ఐఏఎల్ రాష్ట్ర కార్యదర్శులు మాధవరావు, అజయ్, ఐఏఎల్ రాష్ట్ర నాయకులు భగవతి, న్యాయవాదులు హర శ్రీనివాస్, బాబు, సుధాకర్, సురేశ్, దొరబాబు, సన్యాసిరావు, భద్రం, తాకాశి వెంకటేశ్వరరావు, బుద్ధ విరునాయుడు, శివరామ్, కోరుబిల్లి శంకరరావు ప్రసంగించారు.

జీవో నం.1ని భోగి మంటల్లో దహనం చేద్దాం

జల్లి విల్సన్ పిలుపు

విశాలాంధ్ర-బాపట్ల: పౌరహక్కులకు భంగం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు ఒకటిని భోగి మంటల్లో దహనం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పిలుపునిచ్చారు. బాపట్లలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నాగాంజనేయులు అధ్యక్షతన బాపట్లలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జంగాల అజయ్‌కుమార్ పాల్గొన్నారు. జల్లి విల్సన్ మాట్లా డుతూ ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ నిరంకుశత్వం ప్రదర్శిస్తున్న ప్రభుత్వ తీరును ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. భోగి పండుగ సందర్భంగా 14వ తేదీన పార్టీ నేతలు, ప్రజాసంఘాలు ఆ చీకటి జీవో పత్రాలను దహనం చేయాలని విజ్ఞప్తి చేశారు. 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జగనన్న కాలనీ, టీడ్కో ఇళ్ల లబ్ధిదారుల నుంచి సంతకాలు సేకరించి ఫిబ్రవరి 6వ తేదీన జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. 22న రాష్ట్ర సదస్సు నిర్వహించి ప్రజా స్పందనను ప్రభుత్వానికి తెలియజేసే కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. కాగా, సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శిగా తన్నీరు సింగరకొండను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శిగా తన్నీరు సింగరకొండను సమావేశం ఏకగ్రీవంగా ఎన్ను కున్నది. సింగరకొండను పార్టీ నేతలు అభినందించారు. జిల్లాలో సీపీఐని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని, ప్రజల హక్కుల కోసం పోరాడాలని నాయకులు సూచించారు. సింగరకొండ ఇటీవల విజయవాడలో జరిగిన సీపీఐ జాతీయ మహాసభలో వలంటీర్‌గా ఉత్సాహంగా పాల్గొని నేతల మెప్పు పొందారు. యువకుడిగా కమ్యూనిస్టు భావజాలంతో ప్రజా సమస్యలపై పోరాటంలో ముందుండే సింగరకొండను జిల్లా కార్యదర్శిగా ఎన్నికోవటంపై నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

రాజీనామా చేసి వైసీపీలో చేరండి

ఏఎన్‌యూ వీసీపై విద్యార్థి, యువజన సంఘాల ఆగ్రహం

విశాలాంధ్ర-గుంటూరు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రాజశేఖర్ తన పదవికి రాజీమానా చేసి వైసీపీలో చేరాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు సూచించాయి. జీఓ నెం.1ను సమర్థిస్తూ వర్సిటీలో సదస్సు నిర్వహించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశాయి. గుంటూరు మల్లయ్య లింగంభవన్‌లో వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు గురువారం విలేకరులతో మాట్లాడాయి. ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వీసీ రాజశేఖర్ తన అవినీని, అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికే వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నెం.1ను సమర్థిస్తూ వర్సిటీలో అవగాహన సదస్సు నిర్వహించారని మండిపడ్డారు. పదివి కోసం విశ్వవిద్యాలయాన్ని వైసీపీ విద్యాలయంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ అంశాలకు దూరంగా ఉండాల్సిన విశ్వవిద్యాలయాల్లో ఒక పార్టీకి మద్దతుగా కార్యక్రమాలు నిర్వహించడం సిగ్గుచేటుగా భావించాలని అన్నారు. మూడు రాజధానులకు మద్దతుగా సదస్సు నిర్వహించారని, ఆ సదస్సులోనే ఏఐఎస్ఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేసి అడ్డుకున్నారని గుర్తుచేశారు. వీసీపై కేసు ఫైల్ చేసి, అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నామన్నారు. దేశంలోకి చొరబడుతున్న విదేశీ విశ్వవిద్యాలయాలపై సదస్సు నిర్వహించే దమ్ముందా అంటూ వీసీని ప్రశ్నించారు. ఇదేవిధంగా వైసీపీకి కొమ్ముకాస్తూ విద్యార్థులకు తప్పుడు సంకేతాలు అందిస్తే వీసీ భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు, ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాని, జిల్లా అధ్యక్షుడు చైతన్య, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు జ్ఞానదీప్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్, డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కృష్ణ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సాగనంపుదాం

రామానాయుడు పిలుపు

విశాలాంధ్ర-తిరుపతి: ప్రజాకంఠక పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సాగనంపాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామా నాయుడు పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లా సమితి, శాఖకార్యదర్శుల సమావేశం వీసీ గోపీనాథ్ అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో గురువారం జరిగింది. రామానాయుడు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రాన్ని అంధకారంలో ముంచిందని విమర్శించారు. పోలవరంను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినా నిధులు ఇవ్వడం లేదని, నిర్వాసితులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ మంటగలిసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొ రేట్‌లకు కట్టబెడుతోందన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. విభజన రాజకీయాలతో దేశంలో కల్లోలం సృష్టిస్తోందన్నారు. జగనన్న ఇళ్లకు ప్రభుత్వం ఇస్తున్న నిధులను రూ.5 లక్షలకు పెంచాలని సీపీఐ ఉద్యమిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో అవినీతి పెరిగి పోతోందని, తిరుగుబాటుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రామానాయుడు చెప్పారు. తిరుగుబాటు అణచివేత కోసం జీవో నంబర్ ఒకటి తీసుకొచ్చారని ఆరోపించారు. ఈ జీవో కాపీలు భోగిమంటల్లో దహనం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజన్ పార్టీ నిర్వహించిన కార్యక్రమాలు వివరించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జనార్దన్ మాట్లాడుతూ జిల్లాలో సహకార చక్కెర కర్మాగారాలు, విజయ డెయిరీ పునః ప్రారంభం కోసం గ్రామస్థాయిలో ఉద్యమం చేపట్టాలన్నారు. విద్యుత్తు మోటార్లకు మీటర్లపై పోరాటం సాగించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యవర్గసభ్యులు కోదండ, సుబ్రహ్మణ్యం, సీనియర్ నేత మణి, సత్యమూర్తి, దాసరి చంద్ర, విజయ గౌరీ, మార్కొండయ్య,ముని రత్నం నాయుడు, జయకుమారి, రమాదేవి, జయలక్ష్మి, బాలాజీరావు, కుమారి, గజేంద్ర బాబు, రామమూర్తి, మోహన్‌బాబు, అది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబరు 1 రద్దు చేసే వరకు పోరు

కేవీవీ ప్రసాద్ పిలుపు

విశాలాంధ్ర-మచిలీపట్నం: రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జీఓ నంబరు1ని తక్షణం రద్దుచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. రహదారులపై బహిరంగ సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతిలేదంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నంబరు 1ని రద్దుచేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన హైకోర్టు జీఓని ఈ నెల 23వ తేదీ వరకు సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా జీఓని ఉపసంహరించుకోవాలన్నారు. జీఓ నంబరు 1ని వ్యతిరేకిస్తూ ఇక్కడి మోదుమూడి శ్రీహరిరావు భవన్‌లో గురువారం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ, జీవో నంబర్ ఒకటిని తిప్పి కొట్టేదాకా పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య దేశంలో హక్కులను సాధించుకోవడం కోసం ప్రతి ఒక్కరూ చేసే ప్రయత్నాన్ని తిప్పి కొట్టడానికి ఈ నల్ల జీవోని జగన్ తీసుకువచ్చారని విమర్శించారు, పౌరహక్కులకు భంగం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు ఒకటిని భోగి మంటల్లో దహనం చేయాలని కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి తాటిపర్తి తాతయ్య మాట్లాడుతూ నల్ల జీవోను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్, జిల్లా నాయ కులు దగ్గాని సంగీతరావు, మేరుగు విజయ్ కుమార్, బండి అరుణప్రసాద్, తూము చిన కొండయ్య, మోదుమూడి నాగరాజు, యక్కల పితాంబరధరరావు, యర్రంశెట్టి ఈశ్వరరావు, ఒడుగు రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యాలయం ప్రారంభం

ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలతో ముందుకెళుతున్న సీపీఐ కృష్ణాజిల్లా కార్యాలయాన్ని గురువారం స్థానిక మోదుమూడి శ్రీహరరావు భవనంలో కేవీవీ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పోరాటాలకు ఈ కార్యాలయం నాంధి అన్నారు. ఎందరో పెద్దలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజల హక్కుల కోసం దఫాలుగా పోరాటాలు చేసి సాధించిన ఘన చరిత్ర మచిలీపట్నానికి ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో పై నాయకులందరూ పాల్గొన్నారు.

వైసీపీ నేతపై హత్యాయత్నం కేసు

కరవది సుబ్బారావు డిమాండ్

విశాలాంధ్ర - కావలి: దళిత యువకుని పై దాడి చేసిన వైసీపీ నేత మహేష్ నాయుడుపై సెక్షన్ 307 కింద హత్యాయత్నం కేసు నమోదు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు డిమాండ్ చేశారు. బాధిత యువకుడు గోచిపాతల తేజ ను ఉలవపాళ్ల లోని అతని ఇంటి వద్ద గురువారం ఆయన పరామర్శించారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. తేజ కు న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మహేష్ నాయుడు అత్యంత అమానుషంగా దాడి చేసి, విచక్షణారహితంగా చావ బాది, ఇనుప రాడ్డుతో చంపే ప్రయత్నం చేస్తే కనీసం హత్యాయత్నం కేసు నమోదు చేయకపోవడం దారుణమని అన్నారు. తేజ పై జరిగిన దాడి దృశ్యాలు చూసి కూడా నిందితుల పై న్యూసెన్స్ వంటి చిన్న కేసులు పెట్టడం న్యాయమేనా అని ప్రశ్నించారు. పెట్టిన అట్రాసిటీ కేసు లో కూడా స్టేషన్ బెయిల్ ఇవ్వడం సిగ్గుచేటన్నారు. దీని పై తాము జాతీయ ఎస్సీ కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యంగా కావలి నియోజక వర్గంలో దళితుల పై దాడులు పెరిగిపోయాయని అన్నారు. నిందితుల పట్ల పోలీసులు మెతక వైఖరి అవలంబిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మహేష్ నాయుడు పై హత్యాయత్నం (307) కేసు నమోదు చేయాలని లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కావలి నియోజక వర్గ కార్యదర్శి నాగరాజు, సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కరవది భాస్కర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు జగన్ మోసం

మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని పాడి రైతులను జగన్ ప్రభుత్వం మోసం చేస్తోందని మాజీమంత్రి నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు. రాష్ట్ర డెయిరీలకు రూపాయి కూడా సాయం చేయడంలేదన్నారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలో సహకార రంగాన్ని పునరుద్ధరిస్తామని జగన్ అన్నారుగానీ దానిని గాలికొదిలేశారు. రెండో ఏడాదిలో సహకార డెయిరీలను బలోపేతం చేస్తామని ఏకోశాన చేయలేదు. అమూల్ డెయిరీతో లోపాయి కారీ ఒప్పందం చేసుకుని ఏపీ పాడి రైతుల డెయిరీలను గుజరాత్‌లోని అమూల్‌కు తాకట్టు పెట్టారని విమర్శించారు. అమూల్ డెయిరీకి రూ.6వేల కోట్లు అప్పణంగా అప్పచెబుతున్నారని, అమూల్ డెయిరీ వల్ల రాష్ట్రంలోని ఏ ఒక్క పాడి రైతుకు మేలు జరగలేదన్నారు. తన కేసుల మాఫీ కోసం, కమీషన్ల కోసం రాష్ట్ర ప్రయోజనాలను జగన్ తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. పాడి రైతులందరూ ఏకమై జగన్‌ను నిలదీయాలని ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు.

టీచర్ల పని సర్దుబాటు రద్దుచేయాలి

ఎస్టీయూ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత పేరుతో ఎలాంటి నియమ నిబంధనలు పాటించకుండా చేస్తున్న పని సర్దుబాటును తక్షణమే రద్దుచేసి పదోన్నతుల ప్రక్రియను పూర్తిచేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం సర్వీసు నిబంధనలలో లేని అంశాన్ని కొత్తగా పని సర్దుబాటు పేరుతో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు రూ.2,500 అదనంగా చెల్లిస్తామనీ, హైస్కూళ్లకు వెళ్లి పాఠాలు బోధించాలని బలవంతంగా, సంక్రాంతి సెలవుల్లో ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ఉపాధ్యాయులను ప్రశాంతంగా సంక్రాంతి పండుగ జరుపుకోనీయకుండా సర్దుబాటు ప్రక్రియ మొదలుపెట్టడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఉన్నతపాఠశాలల విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయుల కొరత ఉంటే నియమ నిబంధనల మేరకు వారిని మండల పరిధిలోనే సర్దుబాటు చేయాలనీ, అలా కాకుండా సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడం నిబంధనలకు వ్యతిరేకమన్నారు. విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలతోనే ఉపాధ్యాయులు కోర్టు మెట్లు ఎక్కాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ చర్యల్ని నిరసిస్తూ...ఈనెల 13న అన్ని జిల్లాల కలెక్టర్లకు, జిల్లా విద్యాధికారులకు వినతి పత్రాలు అందజేస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే సంక్రాంతి పండుగ రోజు ఆందోళన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

'ముఖ ఆధారిత' ఇబ్బందులు పరిష్కరించాలి

ఏపీ జేఏసీ అమరావతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖఆధారిత హాజరు విధానం వల్ల ఉద్యోగులు ప్రధానంగా క్షేత్ర స్థాయిలో ఉన్న ఫీల్డ్ స్టాఫ్‌కు ఉన్న ఇబ్బందులు/ సమస్యలను పరిష్కరించాలని, ముఖ అధారిత హాజరు యాప్‌లో మార్పులు చేపట్టాలని ఏపీ జేఏసీ అమరావతి డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి గురువారం ఏపీ జేఏసీ అమరావతి నేతలు బొప్పరాజు వెంకటేశ్వరరావు, సెక్రటరీ జనరల్ వైవీరావు వినతిపత్రం అందజేశారు. ముఖ ఆధారిత హాజరుతో ప్రధానంగా ఫీల్డ్ స్టాఫ్ ఎదుర్కొనే సమస్యల్ని వివరించారు. ప్రస్తుతమున్న బయో మెట్రిక్ విధానం బ్రహ్మాండంగా పనిచేస్తోందనీ, ఈ విధానం వల్ల ఉద్యోగుల వ్యక్తిగత గోప్యత దెబ్బతినే అవకాశం లేదని పేర్కొన్నారు. ముఖ ఆధారిత హాజరు విధానాన్ని స్వాగతిస్తున్నామనీ, ఈ విధానం అమలు వలన పర్సనల్ డేటాకు రక్షణ ఉండబోదంటూ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆన్ డ్యూటీ/ డిప్యూటేషన్‌లో ఉన్న ఉద్యోగులకు కూడా వారు పని చేసే ప్రాంతం నుండే ముఖ ఆధారిత హాజరు వేసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. సీఎస్‌ను కలిసిన వారిలో రాష్ట్ర నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం అధ్యక్షుడు ఎస్.మల్లీశ్వర రావు, మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ఈశ్వరరావు, లేబర్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మరో రెండేళ్లు ఆర్థిక మాంద్యం

కొవిడ్ మహమ్మారి కొత్త రకాలు భయపెడుతుండటం, ఉక్రెయిన్–రష్యా మధ్య యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో మరో రెండేళ్లు, భారత దేశంలో ఆర్థికమాంద్యం కొనసాగే సూచనలు బలంగా ఉన్నాయి. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తులు తగ్గిపోవడం, ద్రవ్యోల్బణం పెరిగిపోవడం, విదేశీ మారక ద్రవ్యాల వినియోగం తదితర అనేక కారణాల వలన రానున్న రెండేళ్లలో భారతదేశం ఆర్థికమాంద్యం ఎదుర్కోనున్నదని తాజాగా విడుదల చేసిన 'ప్రపంచ ఆర్థికరంగం భవిత' నివేదిక స్పష్టం చేసింది. 2023లో 6.6, 2024లో 6.1 జీడీపీలు నమోదవుతాయని కూడా ఈ నివేదిక తెలియజేసింది. 2023లో భారతదేశం సహా ప్రపంచ ఆర్థికరంగంలో మాంద్యం ఉంటుందని ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టరు క్రిస్టిలినా జార్జివ బహిరంగంగా వెల్లడించారు. మన దేశంలో ఒమిక్రాన్ కొత్తరకం ఇంకా విస్తరించనందున మనం ధీమాగా ఉండవచ్చునని మన కేంద్ర పాలకులు చెపుతున్నారు. మన ప్రభుత్వంవేసే అంచనాలు, లేదా గణాంకాలు విశ్వసించడం కష్టమే. ప్రపంచాన్ని శాసిస్తున్న ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లు చేస్తున్న హెచ్చరికలను ఎంతమాత్రం తిరస్కరించలేం. 2023లో ప్రపంచ జీడీపీలో మూడింట ఒక వంతు కుదించుకుపోతుందని క్రిస్టిలినా హెచ్చరించారు. భారతదేశంలో 2022 జూన్‌లో నమోదైన జీడీపీ వృద్ధిరేటు కంటే 2023లో 0.5శాతం, 2024లో 0.4శాతం తగ్గిపోతుందని ప్రపంచబ్యాంకు నివేదిక పేర్కొంది. ఈ పరిస్థితులన్నీ కలిసి మనదేశంలో పేదరికం పెరుగుతుందని, ఇది తీవ్రంగానే ఉంటుందని అంచనాలున్నాయి.

మోదీ ప్రభుత్వం అంతర్జాతీయ సర్వేలను, నివేదికలను ఏ విషయంలోనూ అంగీకరించదు. గడిచిన డిసెంబరు వరకు 81కోట్ల మందికిపైగా ఒక్కొక్కరికి పది కిలోలు ఆహారధాన్యాలను పంపిణీచేసిన మోదీ ప్రభుత్వం పేదరికం ఎక్కడుందని ఎదురుప్రశ్న వేస్తుంది. పైగా ఆర్థికమాంద్యం 24నెలలు కొనసాగుతుందన్న హెచ్చరికల మధ్య ఆహారధాన్యాల పంపిణీని 5కిలోలకు కోసి పెద్ద సంఖ్యలో ప్రజలను మరిన్ని కష్టాలపాలు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం పూనుకోవడం దారుణం. ఒకవైపు నిరుద్యోగం, ఆర్థికమాంద్యం పెరగనున్న సమయంలో అమెజాన్ లాంటి దిగ్గజాలైన కంపెనీలు, ఐటి సంస్థలు వేలాదిమంది ఉద్యోగులను తొలగించడం ఆర్థిక మాంద్యానికి స్పష్టమైన సంకేతం. ఒక్క అమెజాన్‌లో 20వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. భారతదేశం సహా దక్షిణాసియా దేశాల్లో వడ్డీరేట్ల పెరుగుదల, వాణిజ్య భాగస్వామ్యం పెరుగుదల బలహీనంకావడం, ఎగుమతులు తగ్గిపోవడం ఆర్థిక మాంద్యానికి దారితీస్తాయి. ప్రపంచ ద్రవ్యపరిస్థితులు క్లిష్టంగా మారడం అంచనావేసిన దానికంటే ద్రవ్యోల్బణం పెరుగుదల రేటు ఎక్కువగా ఉంటుంది. మార్కెట్‌లో అన్ని రకాల సేవలరేట్లు అధికమవుతాయి. ఇప్పటికే అన్ని రకాల, వస్తువులు, వంటనూనెలు, రవాణా చార్జీలు, అనేక సేవలరేట్లు పెరిగిపోయి సామాన్య ప్రజల జీవనం భారమైంది. 2019 నాటికంటే భారతదేశం వస్తువుల వాణిజ్యలోటు రెండు రెట్లు తగ్గిపోయింది. 2019 నవంబరులో 24 బిలియన్ డాలర్లు కాగా ఇప్పుడు ఈ లోటు రెండు రెట్లు పెరిగింది. పెట్రోలియం ఉత్పత్తుల్లో 7.6 బిలియన్ డాలర్లు, మిశ్రమలోహాలు, ఖనిజాల తదితర వస్తువుల్లో 4.2 బిలియన్ డాలర్ల లోటు మరింత విస్తరించింది. గత నవంబరులో మనదేశం 550 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యాన్ని ఉపయోగించుకున్నది. జీడీపీలో ఇది 16శాతం. అయితే మారక ద్రవ్యరేటు ఎగుడు దిగుళ్లకు లోనుకావడంతో డాలరుతో పోల్చినప్పుడు రూపాయి విలువ మరింత పడిపోకుండా ఉంది. ప్రస్తుతం రూపాయి విలువ తగ్గుదల పెరిగిందే కానీ తగ్గలేదు. అయితే జీడీపీ వృద్ధిరేటు మన దేశంలో పెరుగుతూనే ఉందని, ప్రపంచ పరిస్థితులు దిగజారిపోతున్నందున పెట్టుబడులు తగ్గిపోయి కొత్త పరిశ్రమలు, ఉత్పత్తులు పెరగడంలేదు.

పెద్ద ఆర్థిక వ్యవస్థలున్న అమెరికా, ఐరోపా యూనియన్ దేశాలు, చైనాలలో ఆర్థికమాంద్యం కొనసాగుతున్నది. ఈ దేశాల్లో కొవిడ్ మహమ్మారి విస్తరిస్తున్నదని వార్తలు వస్తున్న నేపథ్యంలో వస్తువుల ఉత్పత్తులు, సరఫరాలు తగ్గిపోయి అభివృద్ధి చెందుతున్న దేశాలపైన ప్రతికూల ప్రభావం పడుతుంది. భారతదేశంలో కొవిడ్ నాలుగోదశ వచ్చే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్ తాజాగా హెచ్చరించారు. 2020లో మన దేశంలో ఒమిక్రాన్ వైరస్ ప్రవేశించి రెండేళ్లకు పైగా గడగడలాడించింది. లక్షలమంది మృతి చెందారు. ఈ మహమ్మారిని ఎదుర్కోవడంలో మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. కోట్లాదిమంది ప్రజలు పని ప్రదేశాల నుంచి తమ నివాస ప్రాంతాలకు చేరుకోవడానికి ఎనలేని కష్టాలు పడ్డారు. ఆకస్మికంగా లాక్‌డౌన్ ప్రకటించడంతో అన్ని రంగాలు స్తంభించిపోయి కోట్లాది మంది ఉద్యోగాలు ఊడిపోయాయి. ఉత్పతులు క్షీణించాయి. మోదీ ప్రభుత్వం సామాన్యులకు ఎలాంటి సహాయం చేయలేదు. వైద్యసేవలోనూ ప్రభుత్వం విఫలమైంది. వస్తువుల సరఫరా పడిపోయింది. దీనితో కూరగాయల నుంచి అన్ని రకాల వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయి. ఆనాటి అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్థిక మాంద్యం కొనసాగుతుందన్న హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకొని అప్రమత్తం కావాలి.

భగ్గుమంటున్న వంటనూనె ధరలు

డా. ముచ్చుకోట సురేష్‌బాబు

వంట నూనెల ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వల్ల గతంలో భారీగా పెరిగిన నూనెలరేట్లు ఈ మధ్యే తగ్గాయి. అంతలోనే మళ్లీ పెరుగుతున్నాయి. ఈ మధ్యకాలంలో రైతులు శ్రమ తక్కువ ఫలితం ఎక్కువగా ఉండటానికి అలవాటు పడ్డారు. గత సంవత్సరం పంట బీమీ మొత్తం ఎక్కువగా పత్తి, కందికి ఎక్కువగా ఉండటం, వేరుశెనగకు కేవలం వందల్లో ఇవ్వటంతో జిల్లా రైతులు తమ పొలాల్లో వేరుశెనగ నుండి పత్తికి మారారు. ఈ సంవత్సరం పశుగ్రాసానికి, మంచి నూనెకు నామమాత్రంగా వేసిన వేరుశెనగ పూర్తి నిరాశకు గురిచేసింది. తెగుళ్ల బారినుండి కలుపు నివారణకు భూములు నిస్సారంగా మారనున్న స్టాంప్, పెండ మిథేన్, గ్లైసిల్ లాంటి నివారణ మందులు వాడుతున్నారు. నాలుగు సంవత్సరాల కిందట వీటిని నిషేధించినా అవి మార్కెట్లో ఎక్కువ ధరకు దొరుకుతాయి. దేశంలోనే అత్యధికంగా వేరుశెనగ విత్తే ప్రాంతం అనంతపురం జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులున్నా, అధిక వర్షాలున్నా, క్షామం ఉన్నా గత అరవై సంవత్సరాలుగా వేరుశెనగ పండిస్తూనే ఉన్నారు. ఇక్కడ రైతుకు పంట మార్పిడి తెలియదు. వ్యవసాయం ఎక్కువగా సాంప్రదాయ పద్ధతిలో జరిగేది. గత ఇరవై సంవత్సరాల కిందట గుత్తికాయ, తీగకాయ అని రెండు రకాల వేరుశెనగ విత్తనం ఉండేవి. వేరుశెనగ విత్తనం బయట నుండి కొనే రైతులు తక్కువ. ఎక్కువగా తాము పండించిన పంటలోనే కొంతభాగం విత్తనం కోసం తీసిపెట్టేవారు. ప్రతి సంవత్సరం మే నెల నుంచి విత్తనం మనుషుల ద్వారా వలచడం జరిగేది. కానీ ఇప్పుడు విత్తనం నిల్వ ఉంచడం లేదు. ఒక వేళ నిల్వఉంచినా అది ఎందుకు పనికిరాకుండా పోతోంది. గత ఇరవై సంవత్సరాలుగా రైతులు విత్తనంకోసం వ్యవసాయశాఖ మీద ఆధారపడి ఉన్నారు. ఇప్పుడు ఇస్తున్న రకాలు కే6, రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణి చేస్తున్నారు. కదిరి లేపాక్షి 1812రకం కేవలం అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్‌లో రూ.22000 కు విక్రయిస్తున్నారు. ఇది సామాన్య రైతుకు అందుబాటులో లేవు. ట్యాగ్ 32, గుజరాత్ జునాఘఢ్ 32, ఐసిజివి 350 రకాలు కొద్ది ప్రాంతాలల్లో ప్రైవేటు వ్యక్తులు సరఫరా చేశారు. ఈ సంవత్సరం కే6 రకం పూర్తిగా విఫలమైంది, జర్మినేషన్ లేకపోవడం, వాతావరణం అనుకూలించక పోవడం, గత రెండు సంవత్సరాలుగా నమోదైన అధిక వర్షం మొక్కల పెరుగుదలను దెబ్బతీసింది. ఆకువ్యాధి, తెగులు, దాడులు, విపరీతమైన కలుపు తీవ్ర ఇబ్బందులకు గురిచేశాయి. నైరుతి రుతుపవనాలు సమృద్ధిగా వర్షాలు కురిసినప్పుడు రైతులు సంతోషించారు. కానీ జిల్లాలో దాదాపు 5లక్షల హెక్టార్లలో వేసిన వేరుశనగ పంటలో నీరు నిలిచిపోవడం, మట్టిలో అధిక మిశ్రమం కారణంగా పంట తీవ్రంగా దెబ్బతింది. రేకులకుంట వ్యవసాయ పరిశోధనా కేంద్రంలోని శాస్త్రవేత్తలు జూన్, జూలై, ఆగస్టులలో పండించిన పంటలను పరీక్షించి, దిగుబడిని అంచనా వేశారు, ఇది సగటు తుదిదిగుబడి హెక్టారుకు 400 కిలోల కంటే తక్కువ ఉండే అవకాశం ఉందని తెలియచేస్తున్నారు.

వాణిజ్యపరంగా రైతుకు బ్రేక్ ఈవెన్, హెక్టారుకు కనీసం 700 కిలోలు ఉండాలి. జూన్ 1 నుంచి ఆగస్టు 20 వరకు 530 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావడంతో వేరుశనగపంట బాగా దెబ్బతింది. జూలైలో విత్తిన పంటలో చాలావరకు ఆకు ఆకుపచ్చ నుండి పసుపు రంగులోకి మారి ఆకుమచ్చ వ్యాధి ఏర్పడింది. చీడపీడలు పీల్చుకోవడంతో పెద్ద ఎత్తున పంటపై దాడిచేసింది. పేలవమైన పుష్పీకరణ జూన్, జూలైలో విత్తిన వేరుశెనగ పంట(వరుసగా 47,050 హెక్టార్లు, 4,11,128 హెక్టార్లు) పుష్పించే పెగ్‌లు ఏర్పడటం, పెగ్‌లను పాడ్‌లుగా మార్చడంతో మందపాటి వృక్షసంపద వృద్ధిని సాధించింది. ప్రభుత్వంద్వారా సబ్సిడీపై సరఫరా చేయబడిన రకం విత్తనాలపై పెద్దఎత్తున ఆకుమచ్చలు, చీడ తెగులు దాడులు సంభవించాయి. వేరుశెనగ వ్యాపారస్తులు గ్రామానికి వెళ్లడంలేదు. రైతే అతి కష్టం మీద దళారులను ఆశ్రయించో లేక ప్రైవేటు వర్తకులకు సరుకు అమ్ముతున్నాడు. వేరుశెనగ లేక చాలా గ్రామాల్లో చిన్నస్థాయి మిషన్లు, టిల్లర్లు మూతపడుతున్నాయి. వచ్చిన నూనె కూడా నాసిగా, చేదుగా, నురుగు ఎక్కువగా వస్తున్నది.

పండగ సీజన్ కావడంతో వంటనూనెల ధరలు షాకిస్తున్నాయి. ముఖ్యంగా గత పదిరోజులుగా వంటనూనెల ధరలు భగ్గుమంటున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడులు మళ్లీ పెరగడం, ఆ ప్రభావం వంటనూనెలపై పడుతోందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. పొద్దుతిరుగుడు నూనెధర పెరగడంతో దాని ప్రభావం ఇతర వంటనూనెలపైనా పడుతోంది. పామాయిల్ ధర రెండు నెలలుగా క్షీణించి, ఇప్పుడు ఒక్కసారిగా రూ.110 చేరుకుంది. ఐతే వంటనూనెల డిమాండ్‌ను క్యాష్ చేసుకునేందుకు కొందరు వ్యాపారులు రష్యా యుద్ధాన్ని సాకుగా చూపి ధరలు పెంచుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పొద్దుతిరుగుడు, వేరుశనగ నూనెల ధరలు రూ.160 నుండి రూ.180 వరకు ఉండటంతో పామాయిల్ విక్రయాలు బాగా పెరిగాయి. పామాయిల్ ధర లీటరుకు రూ.110లోపే ఉండటంతో హోటళ్లు, శుభకార్యాలయాల్లో దీనికి డిమాండ్ పెరుగుతోంది. దీనికి తోడు కల్తీ నూనెలు భారీగా దిగుమతి అవుతున్నాయి.

ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బియ్యం, పప్పులు, పాలధరలతో పాటు ఇప్పుడు నూనె ధరలు కూడా పెరగడంతో సామాన్యులపై మరింత భారం పడుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలో వంటనూనె ధరలు భారీగా పెరిగాయి. రాష్ట్ర ఎడిబిల్ ఆయిల్స్ అండ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సంఘం ఆందోళన వ్యక్తం చేసినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదు. ప్యాకింగ్ లేకుండా విడిగా నూనెల విక్రయాన్ని నిలుపుదల చేయాలని రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఇలాంటి ఆదేశాల అమలుతో రాష్ట్రంలో వంటనూనెల ధరలు మరింత భారీగా పెరుగుతాయని సంఘం ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. తత్ఫలితంగా లక్షలాది మంది చిరు వ్యాపారులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు.

చలిలో వేడి

రా బావ ఏంటి ఈరోజు యింత చలిగాల్లో స్వెట్టరు లేకుండా వచ్చావు. చలి ఎక్కడ ఉంది బావ దేశమంతా వేడిగాలి విసురుతుంటేనే. అదేంటి బావ మేఘాలు ఉరిమాయి. వర్షాలు పడ్డాయి. ఆ రుతువు అయిపోయి విపరీతమైన చలిగాలులు వీస్తున్నాయి కదా. అందులోకి ఢిల్లీలో మరీ ఎక్కువగా ఉన్నాయి కదా. అది సరె రుతువులే మారినా మన ప్రేమ మారదులే అని ఒక సినిమాలో 1975లో ఒక పాట వచ్చింది. రుతువులు మారిపోతాయని ఆనాడె ఆ కవిగారు ఊహించారు బావ. నిజమే బావ శీతాకాలంలో, వేసవికాలంలో కూడ వర్షాలు పడిన సంఘటనలున్నాయి. కాని గత నాలుగు రోజులుగా చలిగాలులు పెరిగాయి బావ. నిజమె బావ మన దేశంలో ఢిల్లీలో చలి ఎక్కువే గాని అక్కడి రాజకీయ నాయకులకు మాత్రం కాదు బావ. నిజంగా చలిలో బీజేపీ, ఆప్ పార్టీ వాళ్లు ఢిల్లీ మేయరు పీఠం కోసం కొట్టుకుంటున్నారుగ వాళ్లకి చలి ఎక్కడుంది వేడి తప్ప. నిజమె బావ అక్కడేగాదు దేశమంతా వేడి పుంజుకుంది. అంతెందుకు చంద్రబాబు కుప్పం పర్యటనలో వేడి తప్ప చలి ఎక్కడుంది. చలికి దుప్పట్లు కప్పుకుని యింట్లో కూర్చోలేదు బావ. రోడ్డున పడి గొంతుపోయేలా అరుచుకుంటున్నారు బావ. నిజమె బావ జగన్ తెచ్చిన కొత్త జీవో వల్ల మన రాష్ట్రంలో కూడ వేడి ఊపందుకుంది. నిజమె బావ రోడ్డుపై కాక యితర విశాలమైన ప్రదేశాలలో ఎక్కువ జనాన్ని చూపడం చిన్న పార్టీలకు సాధ్యం కాదుగ బావ. రోడ్డుషోలు వద్దంటె చిన్నాచితకా పార్టీలకు యిబ్బందే కద బావ. అది నిజమె బావ కాకపోతె ఈ మధ్య చంద్రబాబు రోడ్డు షోల్లో కొంతమంది చనిపోవడం వల్ల ఈ జీవో తేవలసి వచ్చింది అని అధికార పార్టీ అంటె, కాదు కాదు ప్రతిపక్షాల గొంతునొక్కడానికి అని మిగతా పార్టీలం టున్నాయి. ఎవరి వాదన వారిది. అది సరె జగన్ కూడ యిప్పటి వరకు రోడ్డు షోలు చేశాడు గద బావ. నిజమె బావ కొంతమంది చనిపోవడం చూశాక అధికార పార్టీకి ఇక బలమైన వంక దొరికింది బావ. జగన్ సభలు ఎక్కడ పెట్టినా జనానికి కొదవ ఉండదు. ముఖ్యంగా నగదు చేతిలో పడితే పేదవారు పరుగు పరుగున వస్తారు. మరి ఆ సదుపాయం మిగతా పార్టీలకు లేదుగద బావ. అది నిజమె గాని బావ ఉన్న పళంగా యింత వేడి రావడానికి ముందస్తు ఎన్నికలె కారణ మంటావ బావ. కావచ్చు బావ అటు కేంద్రంలోను, యిటు రాష్ట్రంలోను అధికారపార్టీపై రోజురోజుకు వ్యతిరేకత పెరగడం కారణంగా కనబడుతోంది. అంతెందుకు మన రాష్ట్రంలో కార్పొరేట్ స్కూళ్లు నడిపేవాళ్లు పెద్దపెద్ద ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రివారు జగన్‌పై గుర్రుగాఉన్నారు. అదేంటి బావ గత మూడు సంవత్సరాలు కరోనాపుణ్యమా అని ఆసుపత్రి నిర్వాహకులు బాగానే దోచుకున్నారుగ బావ. తినే నోటికి అడ్డుపడితే ఊరుకుంటారా బావ యిది సహజం.

అంతెందుకు ఉచితాలు అందినవాడు జైజగన్ అంటె అందనివాడు తిడుతున్నాడు. నిజమె బావ నాకు ఒక సంఘటన గుర్తుకొస్తోంది. నాకు తెలిసిన ఒక పార్లమెంటు మెంబరు ఎవరికి సహాయపడకపోగా కంటికి కనబడటమె కష్టం. ఇలా అయితె తిరిగి ఎలా గెలుస్తారని అడిగా బావ. ఆయనన్నాడు అందరికీ సాయం చేయలేం. కొందరికి చేస్తే మరికొందరికి విరోధులవుతాం ఆ చేసేదేదో ప్రభుత్వం చేస్తుంది. అమ్మ గెలిస్తె (ఇందిరా గాంధీ) నేను గెలుస్తా, ఆమె పోతే నేను పోతా ఆ మాత్రానికి ఎందుకు నిందలు పడటం అన్నాడు బావ. ఇపుడు జగన్‌కి ఆ పరిస్థితి ఎదురయింది బావ. నిజమె లోకం తీరు అంతే మరి. అదిసరె బావ రోజురోజుకు మోదీ హవా తగ్గుతోం దంటావా. ఇటీవల జరిగిన ఎన్నికలలో గుజరాత్‌లో గెలిస్తే మరో రెండు రాష్ట్రాలలో ఎదురు గాలి వీచింది. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ ప్రతిపక్షాలను ఏకంచేసే ప్రయత్నం మొదలుపెట్టాడు. నాకు నమ్మకం లేదు బావ బెంగాల్ దీదీ ఒక పట్టాన ఒప్పుకోదు. అనుభవజ్ఞుడు శరద్‌పవార్ వల్ల కావడం లేదు. నిజమె కాని రాజు మంత్రి మోదీ అమిత్‌షాలకు వణుకు పుట్టించగలరు. గుజరాత్ స్వంతరాష్ట్రం కనుక వారిద్దరి మాయాజాలం పనిచేసింది. దేశమంతా అలాగే ఎలా ఉంటుంది. ఒకపక్క బిఆర్‌యస్ పార్టీ పెట్టి ఢీ కొడుతున్నాడు. కె.సి.ఆర్ మరోపక్క బెంగాల్ టైగర్ దీదీ అవినీతి కేసుల్లో ఆప్ మంత్రులను యిబ్బంది పెట్టినా వాళ్ల నాయకుడు కేజ్రీవాల్ వెనక్కు తగ్గడం లేదు.

అది సరె వైసీపీలో కుమ్ములాటలు మాటేమిటి బావ. ఏముంది బావ ఈరోజున ప్రతివాడు సమాజం, ప్రజలు అనే మాటకు దూరమై నాకేంటి అని ఆలోచిస్తున్నాడు. అందుకే ఆ కుమ్ములాటలు. ఇది ప్రతి పార్టీలోను తప్పదు బావ. పదవి రానివాడు అసమ్మతి వ్యక్తపరుస్తాడు. చదువులేని వారు పింఛను రాకో, ఉచితాలు అందకో జగన్‌ను విమర్శిస్తే వైసీపీలో పదవి రాని శాససభ్యులు పార్టీ ముఖ్యులు విమర్శలు చేస్తున్నారు బావ. అందుకేనా బావ బుజ్జగింపులు మొదలుపెట్టాడు జగన్. తప్పదు బావ అధికారం లేని ప్రతిపక్షంలోను అలుగుతున్నారు కద. ఆ తలనొప్పి చంద్రబాబుకు తప్పటం లేదు. అంతెందుకు బీజేపీలో కన్నాకు, పార్టీ అధ్యక్షుడు వీర్రాజుకు పడటంలేదు కద. ఇవన్నీ ప్రజాస్వామ్యంలో అన్ని పార్టీలలో ఉన్న గోలె కద. అది నిజమె కాని ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఇటువంటివి పార్టీ అధినాయకులకు పెద్ద తలనొప్పిగా ఉంటాయి. అది సరెగాని మరీ ఘోరంగా ముసుగు తీసేసి పవన్ చంద్రబాబు ప్రెస్‌మీట్ పెట్టి పవన్ సామాజిక వర్గానికి ఒక షాక్ ఇచ్చారు. పవన్ ఫ్యాన్స్‌కు ఇవి పట్టకపోయినా ఆ సామాజిక వర్గంలో పెద్ద తలకాయలకు తలనొప్పే బావ. ముఖ్యంగా ముద్రగడ వర్గానికి ఆవేదన కల్గించే విషయమె. ఎవరేమనుకున్నా అటు చంద్రబాబు, ఇటు పవన్ యిద్దరూ ఒంటరిగా పోటీ చేయలేనపుడు వారికిది తప్పదు గద. ఇలా రహస్యంగా కొన్నాళ్లు, బయటపడి కొన్నాళ్లు కాపురం చేయడం వల్ల ఇమేజి తగ్గుతుంది గాని పెరగదు బావ.

సెల్: 9885569394

మానవీయ మూర్తి కె.వి



కొత్రగడ్డ వెంకటేశ్వర్లు అంటే గుర్తుపట్టేవారు చాలా తక్కువమంది ఉండొచ్చు. కానీ కె.వి అంటే చాలామంది గుర్తుపడతారు. ఆంధ్రాయూనివర్సిటీలో రాజనీతిశాస్త్ర విభాగానికి మూలవిరాట్టుగా ఉన్నారు. ఆచార్య కె.వి మంగళవారం రాజమండ్రిలో 88వ ఏట అస్తమించారు. ఆయనకు ఇద్దరు అబ్బాయిలు. ఒక అమ్మాయి. పెద్దబ్బాయి రజని, ఆ తరవాత అమ్మాయి లక్ష్మి. మూడవ సంతానం శ్రీనివాస్. రాజమండ్రిలో శ్రీనివాస్ ఇంట్లో ఉండగానే కె.వి తుదిశ్వాస విడిచారు. కాలికి గాంగ్రిన్ వచ్చినందువల్ల ఒక కాలు తీసేయవలసి వచ్చింది. అప్పటినుంచి చిన్నబ్బాయి దగ్గరే ఉండేవారు. ఆయన స్వస్థలం తెనాలి అయినా వృత్తిరీత్యా విశాఖపట్నంలోనే దశాబ్దాల పాటు గడిపినందువల్ల ఆ నగరంతో ఆయన జీవితం పెనవేసుకుపోయింది. రాజమండ్రిలో కొడుకు దగ్గర ఉన్నప్పుడు, చివరి రోజుల్లోనూ విశాఖపట్నం వెళ్లాలని తపన పడ్డారు. రెండేళ్ల కింద ఫ్రెడరిక్ ఏంగెల్స్ ద్విశత జయంతి సందర్భంగా విశాఖపట్నం వెళ్లినప్పుడు డీ.వి.వి.ఎస్ వర్మ, నేను ప్రత్యేకంగా వెళ్లి ఆయనను కలుసుకున్నాం. అప్పటికే ఆయన ఒంటరి. ఆయన భార్య శారద అంతకుముందే మరణించారు. ఆమె ఆంధ్ర విశ్వవిద్యాలయంలో లైబ్రరీసైన్సులో పిహెచ్‌డి చేశారు. మేం వెళ్లినప్పుడు ఆయన స్వయంగా టీ తయారు చేసి ఇచ్చారు. దీన్నిబట్టి మనుషులంటే ఆయనకు ఎంత అభిమానమో తెలుసుకోవచ్చు. కొత్త సచ్చిదానంద మూర్తి పర్యవేక్షణలో ఆయన పిహెచ్‌డి చేశారు. ఆయన సిద్ధాంత గ్రంథాన్ని ఇంగ్లాండ్‌లోని రౌలెట్జ్ ప్రచురణాలయం ప్రచురించింది. తెలుగు ద్రావిడ మూలాలున్న భాషే అని కె.వి సాధికారికంగా నిరూపించారు. ఆ సిద్ధాంతగ్రంథాన్ని తరవాత తెలుగులోకి అనువదించారు. నవోదయ ఆ గ్రంథాన్ని ప్రచురించింది.

ఆచార్య కె.వి ఏం రాసినా లోతైన పరిశోధన చేసేవారు. అందుకే ఆయన బహుగ్రంథ కర్త కాలేదు. ఆయనను రాయని భాస్కరుడు అన్నవారూ ఉన్నారు. ఆర్.వి.ఆర్ చంద్రశేఖరరావు, ఆచార్య ప్రసన్న కుమార్, ఆచార్య ప్రసాదరావు కె.వి సమకాలికులు. మూడేళ్లపాటు ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలకు ప్రిన్సిపల్‌గా ఉన్నారు. కొంతకాలం విశ్వవిద్యాలయం సిండికేట్ సభ్యుడిగా ఉన్నారు. ఆ తరవాత హాస్టల్ వార్డెన్‌గా ఉన్నారు. ఆయనకు ఉన్న తాహతుకు ఒక దశలో ఆయన వైస్ చాన్సలర్ కావాల్సింది. కానీ ఆంధ్రా యూనివర్సిటీలో ఉన్న రాజకీయాల కారణంగా ఆ అవకాశం కోల్పోయారు. ఆయన ఎప్పుడూ విద్యార్థి పక్షపాతే. కాస్త తెలివితేటలు ప్రదర్శించే విద్యార్థులు తారసపడితే వారిని అమితంగా ప్రోత్సహించేవారు. ఎప్పుడూ విద్యార్థులకు దన్నుగా ఉండేవారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడానికి అవసరమైనప్పుడు వీధిపోరాటాలు చేయడానికీ ఆయన వెనుకాడ లేదు. అనేకమంది విద్యార్థులు చదువుకోవడానికి ఆర్థికంగా గుప్తదానాలు చేసే వారు. ముఖ్యంగా అవకాశాలు తక్కువగా ఉండే దళితవిద్యార్థులకు బాసటగా నిలిచే వారు. భార్య శారద అనారోగ్యంగా ఉన్నప్పుడు ఆయన చేసిన సేవ నిరుపమానమైంది. అన్నీ తానేఅయి సపర్యలు చేశారు. విశాలాంధ్ర ప్రచురణాలయం ఆంధ్రప్రదేశ్ దర్శిని ప్రచురించింది. ఎప్పటికప్పుడు దీనిలో కొత్త సమాచారంచేర్చి అనేకసార్లు పునర్ముద్రించారు. ఇందులో ఆయన అనేక విలువైన వ్యాసాలు రాశారు.

ఆయన రాసిన గ్రంథాలు సంఖ్యలో తక్కువే అయినా దేశమంతా ఆయనకు మంచిగుర్తింపు ఉండేది. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులుగా పనిచేసినవారు వేలల్లో ఉంటారు. కానీ అందరి అభిమానాన్ని చూరగొని, విద్యార్థులకు అండగానిలిచి, వారి అభ్యున్నతి కోసం తపించిన కె.వి.లాంటి వారు గుప్పెడు మందేఉంటారు. ఆయనకు ఉన్న పరిశోధనాదృష్టి చాలా విస్తృతమైంది. ఆయనకు నిజాయితీతో పాటు నిబద్ధత, విద్యావేత్తకుఉండే లక్షణాలు అపారంగా ఉండేవి. భారత సమాజంలో ఉన్న దోపిడీ విధానాన్ని, రాజకీయాలను ఆయన విడమర్చేతీరు ఆశ్చర్యం కలిగించేది. రెండేళ్లకింద ఆయన్ను కలుసుకున్నప్పుడు 86ఏళ్ల ఆ మనిషిలో సమాజంకోసం ఎంత తపన ఉందో చూసి ఆలోచనాపరులకు వయసుతో నిమిత్తం లేదనిపించింది. మనం ఏదైనా చేయాలని ఆ వయసులోకూడా అన్నారు.

ఆయన రాసిన "డెమాక్రసీ ఎట్‌వర్క్", వలసవాదం మీద రాసిన గ్రంథం నిరుపమానమైనవి. పరిచయం ఉన్నవారు ఆయనను మరిచి పోవడం కష్టం. చుట్టూ కుళ్లు రాజకీయాలకంపు కొడుతున్నా ఆయన జీవితంఅంతా మానవీయ విలువలకే ప్రాధాన్యం ఇచ్చారు.

-ఆర్వీ రామారావ్

ఉన్నతవిద్యలో తరుగుతున్న ప్రమాణాలు

నేటి విద్యా వ్యవస్థలో గుణాత్మకతను మరిచి పరిమాణాత్మకతతో పట్టం కడుతున్నాం. డిగ్రీ, పీజీల సంఖ్యను పెంచుతూ విద్యా ప్రమాణాలను తుంచుతున్నాం. నేటి యువతలో 50శాతం జనాభా వయస్సు 25 ఏండ్ల కన్న తక్కువగా ఉంది. 2021లో 6.5లియన్ల యువత వివిధ డిగ్రీలు అందుకోగా, ఇందులో 86శాతం గ్రాడ్యుయేట్స్, 12శాతం పీజీ, 1శాతం డిప్లమా/సర్టిఫికేట్ కోర్సులు (24,000 పీహెచ్‌డీ పట్టాలు) పొందినవారు ఉన్నారు. 2011 వివరాల ప్రకారం, దేశ జనాభాలో 8.15శాతం(9.86 కోట్లు) యువత డిగ్రీ అర్హతను సాధించారు. మనదేశంలో నలుగురిలో ఒకరు యంబిఏ, ఐదుగురిలో ఒకరు ఇంజనీర్, పదిమందిలో ఒక గ్రాడ్యుయేట్ ఉద్యోగం పొందడానికి కావలసిన పరిజ్ఞానాన్ని కలిగి ఉన్నారు. గతంలో సెకండరీ(10వ తరగతి) లేదా సీనియర్ సెకండరీ(ఇంటర్) లేదా డిప్లమో ఉద్యోగాలకు కనీస అర్హతలుగా డిగ్రీ, పీజీలు ఉండేవి. ఉద్యోగ, ఉపాధి ఎంపిక ప్రక్రియలో కనీస విద్యార్హతను పెంచడాన్ని 'విద్యా ద్రవ్యోల్బణం లేదా అకడమిక్ ఇన్‌ఫ్లేషన్'గా అర్థం చేసుకోవాలి. సెకండరీ అర్హత ఉన్న ఉద్యోగాలకు కనీస అర్హత డిగ్రీగా, డిగ్రీ అర్హత కలిగిన ఉద్యోగాలకు అర్హత పీజీగా, పీజీ అర్హతఉన్న ఉద్యోగాలకు పీహెచ్‌డీ ఉండాలన్న ప్రకటనలు మనం చూశాం. పాఠశాల సర్టిఫికేట్ స్థానాన్ని డిగ్రీ సర్టిఫికేట్, డిగ్రీ సర్టిఫికేట్ స్థానాన్ని పీహెచ్‌డీ పట్టా తీసుకోవడమే విద్యా ద్రవ్యోల్బణం. డిగ్రీ చేసిన యువత పెరగడం, విద్యాప్రమాణాలు తగ్గడం, డిగ్రీ పట్టాలకు విలువతగ్గడంతో విద్యా ద్రవ్యోల్బణం ఏర్పడుతుందని నిపుణుల అంచనా.

ఫీజుల మోత

డిజిటల్ యుగంలో యువత తమ విద్యార్హతలను పెంచుకోవడానికి ఉన్నత డిగ్రీలు చదవడం, ఆకర్షణీయ వేతనాలతో ఉద్యోగాలు పొందడానికి ఎక్కువ సంవత్సరాలు విశ్వవిద్యాలయాల్లో గడుపుతున్నారు. డిగ్రీ, పీజీ, పిహెచ్‌డి పట్టాలు పొందేందుకు ఉత్సాహం చూపుతున్న ఆధునికయువత ఆయారంగాల్లో నైపుణ్య శిక్షణ పొందడానికి ఉత్సాహం చూపకపోవడంతో ఉన్నత డిగ్రీలు ఉన్నప్పటికీ ఉద్యోగాల ఎంపికలో విజయం సాధించడంలో విఫలం కావడం సాధారణమైంది. విద్యాలయాల ఫీజులు అపరిమితంగా పెరగడంతో ఖరీదైన విద్యగా కూడా 'ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్లేషన్'కు దారి తీస్తున్నది. 2012-20 మధ్య ఆహార ద్రవ్యోల్బణం 9.62శాతం, వైద్య, ఆరోగ్య ద్రవ్యోల్బణం 8శాతం, విద్యా ద్రవ్యోల్బణం 10శాతం పెరిగింది.

మార్కులు ఘనం, నైపుణ్య ప్రమాణాలు శూన్యం

ఉద్యోగంలో చేరి నైపుణ్య అనుభవాలను పొందడానికి ఇష్టపడని యువత ఉన్నత విద్యకోసం ఆరాటపడడం, తక్కువ అర్హతలు కలిగిన ఉద్యోగ ఉపాధులకు ఎక్కువ విద్యార్హతలు కలిగిన యువత క్యూలో ఉండటం విచారకరం. వివిధ సంస్థలు తమ ఉద్యోగులను ఎంపికచేసే ప్రక్రియలో కనీస విద్యార్హతలను పెంచడం, కనీస మార్కులను 70 లేదా 80 శాతం ఉండాలని ప్రకటనలో పేర్కొనడం లాంటివి విద్యా ద్రవ్యోల్బణానికి రుజువులు. ఆఫీస్ సబార్డినేట్, కానిస్టేబుల్, రైల్వే లైన్‌మెన్, ఫోర్త్ క్లాస్ ఉద్యోగానికి పీజీ లేదా పిహెచ్‌డీ పట్టాలు పొందిన యువత వీటికి మొగ్గుచూపుతున్న దుస్థితిని గమనిస్తున్నాం. నేటి విద్యా వ్యవస్థలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ అటానమస్ కాలేజీలు, విశ్వ విద్యాలయాలు తమసంస్థల్లో అడ్మిషన్లను పెంపుదలకు, యువతను ఆకర్షించడానికి డిగ్రీ సిలబస్, పరీక్షా విధానాలను సరళతరం చేయడంతో విద్యార్థులందరూ స్వల్ప విద్యా ప్రమాణాలతో ఉత్తీర్ణత సాధించడం, ఉద్యోగాలకు విద్యార్హత కలిగిన యువతలో పోటీ విద్యా ద్రవ్యోల్బణానికి కారణం అవుతున్నాయి. ప్రస్తుత విద్యా విధానంలో డిగ్రీ పూర్తిచేసిన యువతలో 90శాతం కన్నా ఎక్కువ మార్కులు పొందిన వారు అధికంగా ఉన్నారు. గతంలో డిగ్రీపూర్తిచేసిన యువతలో ప్రథమశ్రేణి(60శాతం కన్న ఎక్కువ) పొందడం కష్టంగా ఉండేది. తృతీయశ్రేణి (50శాతం మార్కుల కన్న తక్కువ)లో పాస్‌అయిన యువతలో విద్యాప్రమాణాలు, విషయ పరిజ్ఞానం అధికంగాఉండడంతో ఉద్యోగాలకు ఎంపికకావడం కనిపించేది. పేరు చివర బిఏ/బికాం/బియస్సీ డిగ్రీని పెట్టుకోవడం గౌరవంగా ఉండేది. ప్రస్తుతం పేరు చివరన పీహెచ్‌డి అని రాసు కోవడం గుర్తింపు లేనిదిగా ఉంది. ఉద్యోగాలకు పోటీ విపరీతంగా పెరుగుతోంది. పుస్తక జ్ఞానార్జనకు ఉత్సాహం చూపుతున్న యువత నైపుణ్య సాధనకు వెనుకంజ వేస్తున్నారు. పట్టాచేతికి వచ్చిన తరువాత ఉద్యోగాల ఎంపికకు నైపుణ్యాల అవసరం తెలుసుకొంటూ, కోచింగ్ సెంటర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. డిజిటల్ యుగపు యువత డిగ్రీ, పీజీ, పిహెచ్‌డీ పట్టాలు/ఉత్తమ గ్రేడ్ మార్కులతోపాటు ఆయా రంగాల్లో ఉత్తమనైపుణ్యాలను, ఉన్నతవ్యక్తిత్వాలను పొందడానికి ప్రయత్నిస్తేనే ఆకర్షణీయ వేతనాలతో కూడిన ఉద్యోగాలకు ఎంపిక జరుగుతుంది.

డా. బుర్ర మధుసూదన్‌రెడ్డి, 9949700037

విపత్తు రాష్ట్రంగా ఉత్తరాఖండ్

- జోషిమఠ్ తర్వాత కర్ణప్రయాగ్, లాండూర్‌కు ముప్పు
- ఒకదాని తర్వాత ఒకటిగా కుంగుతున్న పట్టణాలు
- ఒరిగిపోతున్న ఇళ్లు-గోడలకు పగుళ్లు - భయాందోళనలో ప్రజలు
- క్షేత్రస్థాయి పరిస్థితుల సమీక్షకు రంగంలోకి నిపుణుల బృందాలు

డెహ్రాడూన్/గోపేశ్వర్: ఉత్తరాఖండ్ విపత్తు రాష్ట్రంగా మారింది. ఇక్కడి పట్టణాలు వరుసగా ముప్పునకు గురవుతున్నాయి. జోషిమఠ్ తర్వాత చమోలీ జిల్లాలోని కర్ణప్రయాగ్, లండూర్ పట్టణాల్లోనూ భూమి కుంగుతోంది. ఇళ్లు ఒరిగిపోయాయి. గోడలకు పెద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. ప్రజలు భయాందోళనకు గురవుతూ ఇళ్లు-వాకిళ్లు వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. తాజాగా కర్ణప్రయాగ్‌లోని బహుగుణనగర్‌లో 50కుపైగా ఇళ్లకు పగుళ్ల ఏర్పడ్డాయి. దీంతో మున్సిపల్ అధికారులు ముఖ్యమంత్రి సాయాన్ని కోరారు. అయితే ఈ సమస్య ఉత్తరాఖండ్‌లో చాలా ఏళ్లుగా ఉంది. అయితే పాలకులు వీటిని బేఖాతరు చేస్తూ ప్రజల రక్షణకు పట్టించుకోకుండా అభివృద్ధి పేరిట భారీ నిర్మాణాలు చేపట్టడంతో నేడు భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఏ క్షణంలో ఏం జరుగుతుందో... ఎటు వైపు నుంచి ఏమొచ్చి మీదపడుతుందో అన్న భయంలో స్థానికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

జోషిమఠ్‌కు 80కిమీల దూరంలో కర్ణప్రయాగ్ ఉన్నది. 2015 నుంచి ఇక్కడి ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయి. జాతీయ రహదారి వెడల్పు పెంచే పనుల వల్ల భూమి కుంగిపోతోందని, ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని స్థానికులు ఆరోపించారు. మండీ పరిషత్‌కు సంబంధించి భవననిర్మాణాల పనులు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయన్నారు. పిండర్ నది వల్ల భూమి కోతకు గురికాగా వర్షపునీరు బయటకు పంపేందుకు తగిన డ్రైనేజీ వ్యవస్థ లేదన్నారు. 2015లో బహుగుణనగర్‌లో కొండచరియలు విరిగిపడి ఇళ్లు దెబ్బతిన్నాయి. నాడు కర్ణప్రయాగ్ మున్సిపల్ కౌన్సిల్ వెంటనే నష్టనివారణ చర్యలు చేపట్టింది. ఇప్పుడు మరలా ముప్పు ఏర్పడిందని మున్సిపల్ కౌన్సిల్ మాజీ చైర్మన్ సుభాశ్ గైరోలా ఆందోళన వ్యక్తంచేశారు.

అలకానంద, పిండర్ నది సంగమం వద్ద కర్ణప్రయాగ్ ఉన్నందున ప్రతి వర్షాకాలంలో భూమి కోత, ఇళ్లలోకి నీరు ప్రవేశించడం సర్వసాధారణమైందని, పర్యవసానంగా పునాదులు బలహీనమవుతాయన్నారు. మండీ పరిషత్ భవనాల నిర్మాణంలో జేసీబీల వాడకంతో పరిస్థితి మరింత క్షీణించిందని గైరోలా తెలిపారు.

ఇదిలావుంటే, గోడలకు భారీ పగుళ్లు వచ్చి ఇళ్లు ఒరిగిపోయి ఉన్న చిత్రాలు వైరల్ అవుతున్నాయి. జోషిమఠ్ తర్వాత బహుగుణ నగర్‌లో పరిస్థితులు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కర్ణప్రయాగ్‌లో ఇళ్ల దుస్థితి గురించి ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి స్పందిస్తూ 'కొంత కాలంగా ఈ పరిస్థితి ఉన్నదిగానీ దీనిపై చర్చించి తగు నిర్ణయం తీసుకుంటాం' అని చెప్పారు. ఆయన గురువారం జోషిమఠ్‌లో పర్యటించారు. గోపేశ్వర్... చమోలీ జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రాంతాలు, గుప్తకాశి సమీప గ్రామాల్లోనూ ఇదే తరహా పరిస్థితులు ఉన్నట్లు గైరోలా తెలిపారు. బాధితులను ఆదుకోవాలని, వారికి తక్షణమే భద్రత కల్పించే విధంగా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించి ఆచరించాలని ఆయన డిమాండ్ చేశారు. చమోలీ జిల్లా మెజిస్ట్రేట్ హిమాంషు ఖురానా మాట్లాడుతూ, 'కర్ణప్రయాగ్‌లోని ముప్పు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారన్నారు. ఐఐటీ-రూర్కీ నిపుణులను రంగంలోకి దించామని, వారు క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించి అందుకు పరిష్కారాన్ని కనుగునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ముస్సోరీలోని లాండూర్, రిషికేశ్ సమీపంలోని అటాలీ గ్రామంలోనూ భూమి కుంగిపోతోంది. లాండూర్ చౌక్ నుంచి కొహినూర్ భవనం వరకు 100 మీటర్లు 30 ఏళ్లుగా క్రమంగా కుంగుతోందని స్థానిక నాయకులు తెలిపారు.

గిరిపట్టణంలో భారీ నిర్మాణాలు జరుగుతుండటం, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీళ్లు చేరిపోయి ఇలాంటి పరిస్థితికి దారితీసిందని చెప్పారు. ముస్సోరీ ఎస్‌డీఎం శైలేంద్ర సింగ్ నేగి ఈమధ్యనే లాండూర్‌లో పర్యటించారు. ఇళ్లకు వచ్చిన పగుళ్లు, కుంగుతున్న భూమిని పరిశీలించారు. అయితే తీవ్రత తక్కువగా ఉన్నదని గుర్తించారు. అయినప్పటికీ సమీప భవిష్యత్‌లో ముప్పు దృష్ట్యా నష్టనివారణ చర్యలను చేపట్టారు. అటలీ గ్రామంలో భూమిలో పగుళ్లు ఏర్పడ్డాయి. ఆ ప్రాంతంలో రైల్వే సొరంగం పనులు జరగడమే ఇందుకు కారణమని స్థానికులు చెప్పారు. తమ ఊరితో పాటు పక్కనే ఉన్న సింగ్టలి, లాడ్సీ, కౌడియాలా, భవానీ గ్రామాల్లోనూ ఇటువంటి పగుళ్లు ఉన్నాయన్నారు. ఇప్పటికే నిపుణుల బృందాన్ని రంగంలోకి దించామని, ఈ బృందం 15న బాధిత గ్రామాల్లో తనిఖీలు చేపడుతుందని ఎస్‌డీఎం దేవంద్ర నేగి వెల్లడించారు. నివేదికలు వచ్చాక ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నది చర్చించి నిర్ణయిస్తామన్నారు.

జోషిమఠ్ బాధితులకు తక్షణ సాయం

ఉత్తరాఖండ్ సీఎం ధామి కీలక ప్రకటన

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి గురువారం కీలక ప్రకటన చేశారు. ఉత్తరాఖండ్ పట్టణం జోషిమఠ్ కుంగిపోతుండటం, ఇళ్లకు పగుళ్లు రావడంపై ఆందోళన నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జోషిమఠ్ ప్రభావిత కుటుంబాలకు తక్షణమే నష్ట పరిహారం అందజేస్తామని సీఎం స్పష్టం చేశారు. జోషిమఠ్ లో కేవలం 25 శాతం ఇళ్లలో మాత్రమే పగుళ్లు సంభవించాయని వెల్లడించారు. అదేవిధంగా ఇతర ఊళ్లలోనూ ఇలాంటి సమస్యలు ఉన్నాయోమేనన్న విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. దానిని బట్టి తదుపరి నిర్ణయాలుంటాయని చెప్పారు. అంతకుముందు జోషిమఠ్ లో స్వయంగా పర్యటించిన సీఎం... అక్కడ పరిస్థితిని పర్యవేక్షించారు. జోషిమఠ్‌లో బాధిత కుటుంబాలకు చెల్లించాల్సిన నష్టపరిహారం కోసం మార్కెట్ రేటును కమిటీ నిర్ణయిస్తుందని ఆయన తెలిపారు. పరిహారం చెల్లించే రేటును నిర్ణయించేందుకు చమోలీ జిల్లా మేజిస్ట్రేట్ హిమాన్షు ఖురానా నేతృత్వంలో 19 మంది సభ్యుల కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. ఒక్కో బాధిత కుటుంబానికి తక్షణమే రూ. 1.50 లక్షలు చెల్లిస్తున్నామని, దీని కోసం ఇప్పటికే రూ. 45 కోట్లు విడుదల చేసినట్లు ధామి పేర్కొన్నారు. ఇది మధ్యంతర ఉపశమనం మాత్రమేనని ముఖ్యమంత్రి చెప్పారు. తుది పరిహారం, పునరావాసం గురించిన వివరాలు రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. స్థానిక ప్రజల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా జోషిమఠ్‌పై తప్పుడు అభిప్రాయాన్ని సృష్టిస్తున్నారని ఆయన అన్నారు. "ఔలిలో వింటర్ గేమ్స్ ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయి. మరికొన్ని నెలల్లో చార్ ధామ్ యాత్ర ప్రారంభమవుతుంది.

ఈ సమయంలో ఊరు మొత్తం మునిగిపోతోందని ప్రచారం చేయడం తప్పు. ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది' అని ధామి అన్నారు. జోషిమఠ్‌లోని 20-25 శాతం ఇళ్లు మాత్రమే ప్రభావితమయ్యాయని, మొత్తం పట్టణం కాదు - కొందరు తప్పుగా సృష్టించిన అభిప్రాయాన్ని ధామి చెప్పారు. విపత్తు 600-700 ఇళ్లను తాకిందన్నారు. ఇలాంటి అభిప్రాయాన్ని సృష్టించడం వల్ల పర్యాటకులు, తీర్థయాత్రలపై ఆధారపడిన స్థానిక ప్రజల జీవనోపాధి దెబ్బతింటుందని ఆయన అన్నారు. గురువారం సాయంత్రం లేదా శుక్రవారం నాటికి బాధిత కుటుంబాల బ్యాంకు ఖాతాలకు మధ్యంతర సాయం చేరుతుందని ధామి తెలిపారు. విపత్తు పరిస్థితిని అధిగమించేలా ప్రజల మనోధైర్యాన్ని బలోపేతం చేయడానికి సమష్టి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

తీరప్రాంత రక్షణకు ఐసీజీ కట్టుబడి ఉంది: పఠానియా

కోల్‌కతా: హిందూ మహాసముద్ర ప్రాంతంలో వ్యూహాత్మకంగా ఉన్నందున దేశంలోని విస్తారమైన తీరప్రాంతాన్ని పరిరక్షించేందుకు నావికాదళం కట్టుబడి ఉందని ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసీజీ) డైరెక్టర్ జనరల్ వీఎస్ పఠానియా గురువారం తెలిపారు. సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధురాలు కమలాదేవి చటోపాధ్యాయ పేరు మీద అభివృద్ధి పర్చిన అధునాతన 'ఎఫ్‌పీవీ కమలా దేవి' (నిఘా నౌక) ఐసీజీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ సముద్ర తీర భద్రతా సామర్థ్యాలు ముఖ్యంగా తూర్పు సముద్ర తీరంలో మరింత బలోపేతం అవుతాయని ఆయన అన్నారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో దేశ సార్వభౌమత్వాన్ని, సముద్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు తీర రక్షక దళం కృత నిశ్చయంతో ఉందని చెప్పారు. భూ వనరులు క్షీణించడంతో, దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడానికి అన్వేషణ కోసం సముద్రం ఒక నమూనా మారిందని అన్నారు. సముద్ర భద్రత సవాళ్లు, సంక్లిష్టత... భూభాగాలు, గగనతల భద్రత కంటే ఏ విధంగానూ తక్కువ కాదని, ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద తీర ప్రాంత రక్షణ దళంగా భారతదేశ జాతీయ ప్రయోజనాలను పరిరక్షించడంలో ఐసీజీ ప్రశంసనీయంగా పనిచేసిందని కొనియాడారు. ఐసీజీ కోసం ఐదు ఎఫ్‌పీవీలను నిర్మించడానికి జీఆర్‌ఎస్‌ఈ ఒప్పందం చేసుకుంది. నిర్ణీత గడువులోపు చివరిదైన నౌకను అందించినందుకు జీఆర్‌ఎస్‌ఈని పఠానియా అభినందించారు. వివేకానంద జయంతి రోజున కమలా దేవి ఎఫ్‌పీవీ ని ప్రారంభించుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు.

ఉత్తరాఖండ్‌ను కప్పేసిన మంచు

డెహ్రాడూన్: కొండ ప్రాంతమైన ఉత్తరాఖండ్‌ను మంచు కప్పేసింది. ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి చేరుకోవడంతో భారీగా మంచు కురుస్తోంది. అక్కడి గంగోత్రి ఆలయం మంచుతో కప్పుకుపోయింది. చమోలీ జిల్లా జోషిమఠ్ తదితర ప్రాంతాల్లో భారీగా మంచు కురుస్తోంది. దీంతో ఆయా ప్రాంతాలు కనుచూపు మేర శ్వేతవర్ణాన్ని సంతరించుకున్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లాలోనూ ఉష్ణోగ్రతలు భారీగా పతనమవుతున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో మంచు దట్టంగా కురుస్తోంది. ఇళ్లను, రోడ్లను పూర్తిగా మంచు కప్పేసింది. సిమ్లా పట్టణం అంతా శ్వేతవర్ణం అలుముకొంది. ముఖ్యంగా నరకంద ప్రాంతంలోని రహదారిని హిమపాతం ముంచెత్తింది. రోడ్లకు రెండు పక్కలా భారీగా మంచు పేరుకుపోయింది. దీంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు జమ్మూ కాశ్మీర్‌లోని గందర్‌బాల్ జిల్లా సోనామార్గ్ ప్రాంతంలో భారీగా మంచు కురుస్తోంది. కొండలపై నుంచి భారీగా మంచు గడ్డలు కిందకు పడుతున్న దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

ఉత్తరాదిలో కాస్త ఉపశమనం

దేశరాజధాని ఢిల్లీ సహా ఉత్తరాది రాష్ట్రాలకు చలి, పొగమంచు నుంచి కాస్త ఉపశమనం లభించింది. గురువారం ఉదయం మేఘావృతమైన వాతావరణం, తేలికపాటి వర్షం కారణంగా ఆయా ప్రాంతాల్లో పొగమంచు తగ్గడంతో విజిబిలిటీ మెరుగుపడినట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. పంజాబ్, హరియాణా, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ ఉత్తరప్రదేశ్ సహా ఉత్తర భారత్‌లో పరిస్థితులు కాస్త మెరుగుపడినట్లు వెల్లడించింది. గురువారం ఢిల్లీలో కనిష్ఠ ఉష్ణోగ్రత 9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. సఫ్దర్‌జంగ్ ప్రాంతంలో ఉదయం 8.30 గంటల వరకు కనిష్ఠ ఉష్ణోగ్రత 9.3 డిగ్రీలు కాగా, పాలంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 9.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. గురువారం ఉదయం ఢిల్లీలో గాలి నాణ్యత 312గా నమోదైనట్లు ఐఎండీ వెల్లడించింది. మరో రెండు రోజుల పాటు ఉత్తర భారతదేశంలో చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. దీంతోపాటు చలి, పొగమంచు పరిస్థితులు కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

'ఆరవణ' అమ్మకాలు ఆపేయండి: కేరళ హైకోర్టు

తిరువనంతపురం: కేరళలోని ప్రముఖ యాత్రాస్థలం శబరిమల ఆలయంలో 'ఆరవణ' ప్రసాదం విక్రయాలను నిలిపివేయాలని ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డును కేరళ హైకోర్టు ఆదేశించింది. ఈ ప్రసాదం తయారీలో ఉపయోగించే యాలకుల్లో పరిమితికి మించి రసాయనాలు వినియోగించినట్లు ఇటీవల ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) చేపట్టిన లేబొరేటరీ పరీక్షల్లో తేలింది. ఈ యాలకుల్లో 14 రకాల రసాయనాలు మోతాదుకు మించి ఉన్నాయని ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ నివేదికలో స్పష్టం చేసింది. ఈ నివేదిక ఆధారంగా విచారణ చేపట్టిన కేరళ హైకోర్టు ఆరవణ ప్రసాదం విక్రయాలను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. రసాయన పదార్థాలతో కూడిన యాలకులు లేకుండా తయారుచేసిన ప్రసాదం విక్రయించుకోవచ్చని సూచించింది. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు చేసిన యాలకులతో తయారుచేసిన ప్రసాదాన్ని విక్రయించుకోవచ్చని ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డుకు స్పష్టం చేసింది.

1200 ఏళ్ల నాటి బౌద్ధ స్థూపాలు వెలికితీత

పాట్నా: భారత పురావస్తు పరిశోధక శాఖ (ఏఎస్‌ఐ) పన్నెండు వందల ఏళ్ల నాటి రెండు బుద్ధ స్థూపాలను కనుగొంది. బీహార్ రాష్ట్రం నలంద జిల్లాలోని 'నలంద మహావిహార' ప్రాంగణంలోని సరాయ్ తిలా మటిదిబ్బ సమీపంలో ఏఎస్‌ఐ పాట్నా సర్కిల్ జరిపిన తవ్వకాల్లో ఈ సూక్ష్మ స్థూపాలు బయటపడ్డాయి. ఇవి రాతితో చెక్కబడిన బుద్ధుడి బొమ్మలు. ఇవి దాదాపు 1200 సంవత్సరాల నాటివి అయి ఉంటాయని ఏఎస్‌ఐ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వీటిపై మరింత లోతుగా పరిశోధన చేపట్టినట్లు ఏఎస్‌ఐ పాట్నా సర్కిల్ సూపరింటెండెంట్ గౌతమి భట్టాచార్య పీటీఐకి తెలిపారు.

జార్ఖండ్‌లో వ్యాను బోల్తా

ఏడుగురు కూలీల దుర్మరణం

రాంచి: జార్ఖండ్‌లోని సెరైకెలా-ఖర్సావాన్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కూలీలతో వెళ్తున్న పికప్ వ్యాన్ ఒకటి బోల్తా పడటంతో ఏడుగురు కూలీలు దుర్మరణం పాలయ్యారు. మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. కూలీలను తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెప్తున్నారు. ఈ ఘటన గురువారం ఉదయం రాజ్‌నగర్ పీఎస్ పరిధిలోని ఖైర్బానీ గ్రామ సమీపంలో జరిగింది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలకు రాజ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అతివేగమే ప్రమాదానికి కారణంగా ప్రాథమిక అంచనా. అతివేగంగా వెళ్తున్న వ్యాన్‌ను లక్డా కొచ్చా మలుపు వద్ద తిప్పేందుకు డ్రైవర్ ప్రయత్నించి విఫలం కావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తున్నది. వ్యాను క్యాబిన్‌పైన కూడా కూలీలు కూర్చున్నారని స్థానికులు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ఏడుగురు చనిపోవడం పట్ల ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి ప్రభుత్వం తరఫున మెరుగైన చికిత్స అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కూలీలతో నిండిన ఈ వ్యాన్ వేగం ఎక్కువగా ఉండటంతో డ్రైవర్ నియంత్రణ తప్పడంతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. గాయపడిన వారిలో ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. పరిస్థితి విషమంగా ఉన్న ఇద్దరిని జంషెడ్‌పూర్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చైబాసా నుంచి రాజ్‌నగర్ వైపు వెళ్తున్న ఈ పికప్ వ్యాన్‌లో 30 నుంచి 35 మంది కూలీలు ఉన్నారు. రాజ్‌నగర్‌లోని హంసాల్లో ఫౌండ్రీ పనిచేసేందుకు వీరంతా బయల్దేరినట్లు సమాచారం. కూలీలు పశ్చిమ సింగ్‌భూమ్‌లోని గలుబాసా, గాగ్రీ నివాసితులు.

కాంగ్రెస్ సీఎం అభ్యర్థిత్వంపై రచ్చ

తొందరెందుకని థరూర్ సన్నాయి నొక్కులు

మలప్పురం(కేరళ): కేరళలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై చర్చ ప్రారంభమైంది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ పేరు చర్చకు వచ్చింది. దీనిపై శశిథరూర్ గురువారం స్పందించారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉందని, ఇప్పుడే సీఎం అభ్యర్థిత్వంపై మాట్లాడటం సరికాదని థరూర్ వ్యాఖ్యానించారు. ఇప్పుడు కేరళకు ముఖ్యమంత్రి ఉన్నారని, మంచి మెజారిటీతో ఎన్నికైన ప్రభుత్వం ఉందని ఆయన అన్నారు. రాష్ట్రంలో అత్యంత ప్రభావిత మతాలు, కులాల పెద్దలతో శశిథరూర్ సమావేశాలు జరుపుతున్నట్లు వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు. ఎవరిని కలవడానికీ తాను అపాయింట్‌మెంట్ కోరలేదని థరూర్ స్పష్టంచేశారు. ఇటీవల కాలంలో కొంతమంది తనను కలిశారని, తనతో సమావేశం కావాలని కోరుకున్నారని తిరువనంతపురం ఎంపీ చెప్పారు. సీఎం అభ్యర్థిత్వంపై ఏ ఎంపీ...ఎలాంటి ప్రకటన చేయరాదని కాంగ్రెస్ అధిష్ఠానం స్పష్టంచేసిన మరుసటి రోజు థరూర్ అలా స్పందించారు. ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎంపికచేసుకునే సంస్థాగత యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ఉందని స్పష్టంచేసింది. 'ముఖ్యమంత్రి అభ్యర్థిపై మీరు(మీడియా) ఇప్పుడు ఎందుకు చర్చిస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో అలాంటి చర్చకు తావే లేదు. 2026 వరకు మీరు వేచి ఉండాల్సిందే' అని థరూర్ విలేకరుల సమావేశంలో స్పష్టంచేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉందని, 2024లో లోక్‌సభ ఎన్నికలు జరగాల్సి ఉందని, ఏమి చేయాలా? ఎవరుండాలో పార్టీ, ప్రజలు నిర్ణయిస్తారని థరూర్ వ్యాఖ్యానించారు. ఓ రాజకీయ పార్టీ ప్రతినిధిగా తాము దేనికైనా సిద్ధంగా ఉండాలని ఎంపీ చెప్పారు. 2026 కోసం(యూడీఎఫ్ సీఎం అభ్యర్థిగా) మీరు ఎదురుచూస్తున్నారా అని విలేకరులు ప్రశ్నించగా...'మనం ఈ ఏడాది జీవించాలి...తర్వాత 2024, 2025, ఆ తర్వాత 2026 గురించి ఆలోచిద్దాం' అని మర్మగర్భంగా మాట్లాడారు. ఇటీవల కాలంలో కొంతమంది మత, కుల పెద్దలతో సమావేశం కావడంపై కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా విమర్శలు ఎదుర్కొన్నారు గదా అని అడుగగా ప్రతి ఒక్కరితో తనకు మంచి సంబంధాలు ఉంటాయని, తనను ఆహ్వానించిన వారికి 'కాదు' అని చెప్పలేనని థరూర్ పేర్కొన్నారు.

ఆరు యూట్యూబ్ ఛానెళ్లపై నిషేధం

న్యూఢిల్లీ: దాదాపు 20 లక్షల మంది చందాదారులకు నకిలీ వార్తలను వ్యాప్తి చేస్తున్న ఆరు యూట్యూబ్ ఛానెళ్లపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ ఆరు ఛానెళ్లు సమన్వయంతో పని చేస్తూ... ప్రభుత్వానికి, రాజ్యాంగ వ్యవస్థలకు వ్యతిరేకంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని, వాటి వీడియోలకు 51 కోట్లకు పైగా వీక్షణలు వచ్చాయని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) నిజ నిర్ధారణ విభాగం గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. సదరు యూట్యూబ్ ఛానెళ్లు ఎన్నికలు, సుప్రీంకోర్టు, పార్లమెంట్ కార్యకలాపాలు, ప్రభుత్వ పనితీరుపై తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నాయని పేర్కొంది. నిషేధానికి గురైన యూట్యూబ్ ఛానెళ్లలో నేషన్ టీవీ (5.57 లక్షల మంది చందాదారులు), సంవాద్ టీవీ (10.9 లక్షల మంది చందాదారులు) సరోకర్ భారత్ (21,100 చందాదారులు), నేషన్24 (25,400 చందాదారులు), స్వర్ణిమ్ భారత్ (6,070 చందారులు), సంవాద్ సమాచార్ (3.48 లక్షల చందాదారులు) ఉన్నట్లు వివరించింది. పీఐబీ నిజ నిర్ధారణ విభాగం తప్పుడు వార్తల వ్యవహారాన్ని బయటపెట్టిన తర్వాత సంవాద్ సమాచార్, సంవాద్ టీవీ, నేషన్ టీవీ ఛానెళ్లు వాటి పేర్లను వరుసగా ఇన్‌సైడ్ ఇండియా, ఇన్‌సైడ్ భారత్, నేషన్ వీక్లీగా మార్చుకున్నాయని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. గత నెలలో పీఐబీ నకిలీ వార్తలను ప్రచారం చేస్తున్న మూడు ఛానెళ్లను బహిర్గతం చేసింది. వాటిని తొలగించాల్సిందిగా యూట్యూబ్‌కు సిఫార్సు చేసింది.

వేతన బకాయిల కోసం వక్ఫ్ ఉద్యోగుల ఆందోళన

న్యూఢిల్లీ: వేతనాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ వక్ఫ్‌బోర్డు ఉద్యోగులు గురువారం సచివాలయం ఎదుట ఆందోళనకు దిగారు. మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని వక్ఫ్‌బోర్డు ఉద్యోగులు విమర్శించారు. వక్ఫ్‌బోర్డుకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు ఆందోళనలో పాల్గొన్నారు. అలాగే, వక్ఫ్‌బోర్డు నిర్వహణలోని ఇమామ్‌లు, మౌజన్‌ల గౌరవ వేతనం విడుదల చేయాలని, వారికి అనేక నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆందోళనకారులు మండిపడ్డారు. 'పెండింగ్ వేతనాల కోసం మా వాణి వినిపిస్తున్నాం.

వాటిని తక్షణమే విడుదల చేయాలి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఆందోళన జరిగింది. తర్వాత ఢిల్లీ రెవెన్యూ మంత్రికి వినతిపత్రం అందజేశాం' అని బోర్డు ఉద్యోగి ఒకరు చెప్పారు.

తృణమూల్ నేత ఇంటిపై ఐటీ గురి

భారీగా నగదు స్వాధీనం

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే, పశ్చిమబెంగాల్ మాజీమంత్రి జకీర్ హుస్సేన్ కార్యాలయాలు, నివాసాలపై ఆదాయపన్నుశాఖ(ఐటీ) దాడులు చేసింది. ముర్షిదాబాద్, కోల్‌కతా, దేశ రాజధానిలోని ఆయన కార్యాలయాలు, ఇళ్లలో తనిఖీలు చేసి పెద్దమొత్తంలో నగదు స్వాధీనం చేసుకుంది. ఐటీ దాడులు బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు జరిగినట్లు అధికారులు ఓ అధికారి చెప్పారు. హుస్సేన్ తృణమూల్ కాంగ్రెస్ తరఫున రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన పెద్ద వ్యాపారవేత్త. ఐటీ తనిఖీలకు హుస్సేన్ అభ్యంతరం చెప్పలేదని, తనిఖీలకు హుస్సేన్, ఆయన కుటుంబ సభ్యులు, సిబ్బంది పూర్తిగా సహకరించారని వివరించారు. కేంద్ర బలగాల సాయంతో ఐటీ తనిఖీలు జరిగాయని, ముర్షిదాబాద్, కోల్‌కతా, ఢిల్లీల్లోని హుస్సేన్ నివాసం, కార్యాలయాల నుంచి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నగదు లెక్కిస్తున్నామని, అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకుంటామని చెప్పారు. ఐటీ తనిఖీలపై వివరణ తీసుకోవడానికి హుస్సేన్ కోసం ఎంత ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు. ఈ వ్యవహారంపై పార్టీ స్పందించేది లేదని తృణమూల్ నేత, మంత్రి ఫిర్హద్ హకీం చెప్పారు. నగదు లభించిందో లేదా తెలియదని, ఇది పూర్తిగా సాంకేతికపరమైన అంశమని వెల్లడించారు. హుస్సేన్ ఏళ్ల తరబడి వ్యాపారవేత్తగా రాణిస్తున్నారని, వేలాదిమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించారని విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు.

డబ్బు కోసం బీజేపీ తహతహ

అందుకే పర్యాటక క్షేత్రాలుగా పవిత్ర స్థలాలు

సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్

లక్నో: ప్రపంచంలోనే అతి పెద్దదైన రివర్ క్రూయిజ్ ఎంవీ గంగా విలాస్, టెంట్ సిటీని బీజేపీ త్వరలోనే ప్రారంభించనున్నది. దీనిపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ పవిత్రమైన స్థలాలను పర్యాటకంగా మార్చి డబ్బు చేసుకోవడమే మోదీ ప్రభుత్వం ఏకైక లక్ష్యంగా కనబడుతోందని విమర్శించారు. ఇలాంటి కార్యక్రమాలతో బీజేపీ డబ్బు వృథా చేస్తోందని, దీనికి బదులు గంగను శుభ్రం చేసేందుకు ఆ డబ్బును ఉపయోగించాల్సిందన్నారు. 'వారణాసిని చూసేందుకు ప్రజలు తమ జీవిత చరమాంకంలో వస్తారు లేదా ఆధ్యాత్మిక చింతను పెంచుకునేందుకు వస్తారు. అలాంటి స్థలంలో పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ బీజేపీ డబ్బు చేసుకుంటోంది. ఇలాంటి విలాసమైన క్రూయిజ్‌లను సామాన్యులు ఎందుకు ఉపయోగిస్తారు? కేవలం పారిశ్రామిక వేత్తలకు, ఇతర పెద్దలకు ఉపయుక్తంగా ఉంటుంది అని యాదవ్ వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంవీ గంగా విలాస్, టెంట్ సిటీలను ప్రారంభిస్తారు. ఎంవీ గంగా విలాస్ తన ప్రయాణాన్ని వారణాసి నుంచి ప్రారంభిస్తుంది. 3,200 కిలోమీటర్లు ప్రయాణించి 51 రోజుల్లో అసోంలోని డిబ్రూఘర్ చేరుకుని, 27 నదుల మీద రెండు దేశాల్లో ప్రయాణం సాగిస్తుంది. ఈ నేపథ్యంలో అఖిలేశ్ యాదవ్ దీనికి వెనుక ఉన్న పరమార్థాన్ని బుధవారం ట్వీట్ రూపంలో తెలియజేశారు.

ఇక ఆర్టిలరి రెజిమెంట్‌లోనూ మహిళలు!

కేంద్రానికి ఆర్మీ ప్రతిపాదన

న్యూఢిల్లీ: భారత్ సైన్యం కీలక ప్రతిపాదన చేసింది. శత్రు సైన్యం గజగజ వణికిపోయే ఆర్టిలరి రెజిమెంట్‌లోనూ మహిళలను భాగస్వామ్యం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించినట్టు ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే గురువారం తెలిపారు. ఈ మేరకు సైన్యం తరపున కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామనీ, త్వరలోనే ఆమోదం పొందుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి యుద్ధ పరిస్థితుల్లోనైనా భారత సైన్యంలోని ఆర్టిలరీ రెజిమెంట్ కీలకపాత్ర పోషిస్తుంది. ఇది ఇండియన్ ఆర్మీలో రెండో అతిపెద్ద బ్రాంచ్. భారత సైన్యానికి గ్రౌండ్ ఆపరేషన్స్‌లో సహాయం అందిస్తుంది. ఆర్టిలరి రెజిమెంట్‌ను ప్రధానంగా రెండు భాగాలు విభజించారు. మొదటి భాగం ప్రాణాంతక ఆయుధాలకు ప్రసిద్ధి చెందింది. ఇందులో క్షిపణులు, రాకెట్లు, మోర్టార్లు, తుపాకులు, ఫిరంగులున్నాయి. మరో భాగంలో డ్రోన్, రాడార్, నిఘా వ్యవస్థ ఉంటాయి. కార్గిల్ యుద్ధ సమయంలో ఈ రిజిమెంట్ శత్రువులపై దాడి చేసి భారీగా ప్రాణనష్టం కలిగించింది. సరిహద్దుల ఆవల నుంచి ఉగ్రవాదులకు మద్దతు అందుతోందన్నారు. కశ్మీర్ పరిస్థితిపై మాట్లాడుతూ, 2021 ఫిబ్రవరి నుంచి కాల్పుల విరమణ కొనసాగుతోందని చెప్పారు. సరిహద్దులో ఉగ్రవాదం, ఉగ్రవాదులకు మౌలిక సదుపాయాలకు సంబంధించి ఇప్పటికీ మద్దతు కొనసాగుతుందోన్నారు. ఉత్తర సరిహద్దుల్లో పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఏదైనా ఆకస్మిక పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, అవసరమైన నిల్వలు ఉన్నాయన్నారు.

శక్తిమంతమైన భారత్‌తో ప్రపంచానికి ముప్పులేదు

అంతర్జాతీయ యువజనుల సదస్సు ప్రారంభోత్సవంలో కేరళ గవర్నర్

తిరువనంతపురం: శక్తిమంతైన భారతదేశం ప్రపంచానికి ఎన్నటికీ ముప్పు కాబోదని కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ అన్నారు. ఇతరులను శాసించాలని భారత్ అనుకోదని, అలా చేసేందుకు దాని సాంస్కృతిక విలువలు అడ్డు వస్తాయన్నారు. గవర్నర్ ఖాన్ గురువారం అంతర్జాతీయ యువజనుల సదస్సు-2023ను ప్రారంభించారు. జాతీయ యువజనుల దినోత్సవంతో పాటు భారత్ జీ20 అధ్యక్షతను పురస్కరించుకొని ఈ సదస్సు నిర్వహించారు. 'ప్రపంచ దేశాలకు గానీ మానవాళికిగానీ శక్తిమంతమైన భారత్ నుంచి ముప్పు ఉంటుందన్న భయం ఎవరికీ అక్కర్లేదు. అసలు అలాంటి ఆలోచనే పెట్టుకోవద్దు. మనం ఎవరినీ శాసించాలని అనుకోం ఎందుకంటే మనకు మన సాంస్కృతిక- సంప్రదాయ విలువులందుకు అనుమతివ్వవు' అని ఖాన్ అన్నారు. తాను నమ్మినది చేసే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికి ఉంటుది కానీ దానిని ఇతరులపై రద్దేందుకు ఎవరికీ హక్కు లేదని ఆయన నొక్కిచెప్పారు. భారతీయ నాగరిక విశిష్టిత ఇదే అని ఆయనన్నారు. భారత్‌లో విద్యను అభ్యసిస్తున్న వారంతా భారతీయ సంస్కృతి-సంప్రదాయాలకు రాయబారులు అవుతారని, వాటికి తగిన విధంగా జీవితాన్ని గడుపుతారని ఖాన్ ఆకాంక్షించారు.

సమరయాత్రను విజయవంతం చేయండి

బస్సుయాత్ర పోస్టర్ ఆవిష్కరణలో రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కేంద్ర ప్రభుత్వం ఏపీకి అన్యాయం చేస్తోందని, విభజన హామీల అమలుతోపాటు ప్రత్యేక హోదా సాధించేంత వరకు యువశక్తి పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. యువజన, విద్యార్థి సంఘాల అధ్వర్యంలో 'ప్రత్యేక హోదా-ఆంధ్రుల హక్కు' నినాదంతో ఈనెల 20న హిందూపురం నుండి చేపట్టనున్న సమరయాత్రకు సంబంధించిన 2.0 పోస్టర్ ఆవిష్కరణ గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విభజన హామీలు అమలు చేయకుండా మోదీ ప్రభుత్వం ఏపీకి తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. విభజన హామీల తోపాటు ప్రత్యేక హోదా సాధించేంత వరకు రాజకీయాలకు అతీతంగా కేంద్రంపై పోరాడాలని పిలుపునిచ్చారు. తనకు 25 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రం మెడలు వంచుతానని చెప్పిన జగన్...ప్రధాని మోదీకి బానిసగా మారారన్నారు. విశాఖ రైల్వే జోన్ లేదు. రామాయపట్నం పోర్టు, కడప ఉక్కు ప్యాక్టరీ ఊసే ఎత్తడం లేదు. రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీని మర్చిపోయారని రామకృష్ణ విమర్శించారు. సకాలం నిధులు విడుదల చేయడం ద్వారా పోలవరం ప్రాజెక్టును 2024 కల్లా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీగా ఉన్న లక్ష ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలన్నారు. విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన సమరయాత్ర 2.0ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేకహోదా ముగిసిన అధ్యాయమన్న వారిని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాలు చేశామని, దీనిని మరింత ఉధృతం చేద్దామన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై అధికార, ప్రతిపక్ష పార్టీలు మౌనం వహించడమే కాకుండా మోదీకి దాసోహమనడం సిగ్గుచేటన్నారు. బస్సు యాత్రకి టీడీపీ, కాంగ్రెస్, నవతరం, ఆమ్‌ఆద్మీ పార్టీ మద్దతిచ్చాయని, ఇతర ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలు మద్దతివ్వాలని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనేపూడి శంకర్, సీపీఎం రాష్ట్ర నాయకులు సీహెచ్ బాబురావు, టీడీపీ నేత లింగమనేని శివరామ ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు జి.గురునాథం, నవతరం పార్టీ నాయకుడు రావు సుబ్రహ్మణ్యం, యువజన సంఘాల నాయకులు పరుచూరి రాజేంద్రబాబు, లంక గోవిందరాజులు, ఐ.రాజేశ్, ఎ.రవిచంద్ర, కె.శివారెడ్డి, మందగల్లా సాయికుమార్, జి.ఓబులేసు పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థపై అసాధారణ దాడి

ధన్కర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆగ్రహం

న్యూదిల్లీ: కేశవనంద భారతీ కేసు-1973లో వెలువడిన చరిత్రాత్మక తీర్పును ప్రశ్నిస్తూ రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్ చేసిన వ్యాఖ్యలను న్యాయవ్యవస్థపై అసాధారణ దాడిగా కాంగ్రెస్ వర్ణించింది. ఒక రాజ్యాంగ బద్ధ వ్యవస్థపై మరో రాజ్యాంగబద్ధ వ్యవస్థ దాడికి దిగడం అసాధారణమని పేర్కొంది. 2015లో ఎన్‌జేఏసీ చట్టాన్ని రద్దు చేయడాన్ని ఉపరాష్ట్రపతి బుధవారం విమర్శించారు. అలాగే కేశవనంద భారతీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని పార్లమెంటు సవరించగలదు గానీ దాని ప్రాథమిక నిర్మాణాన్ని కాదన్న సుప్రీంకోర్టు తీర్పుతో ఏకీభవించనన్నారు. దీంతో ధన్కర్ తీరును కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఖండించారు. ఎంపీగా తన 18ఏళ్ల కెరీర్‌లో 1873 నాటి కేశవనంద భారతీ కేసులో సుప్రీంకోర్టు తీర్పును విమర్శించిన దాఖలాలు లేవన్నారు. బీజేపీ నేత అరుణ్ జైట్లీ దీనిని మైలురాయి తీర్పంటూ కొనియాడారని గుర్తుచేశారు. 'నేడు ధన్కర్ దానిని తప్పు అంటున్నారు. ఇది న్యాయవ్యవస్థపై అసాధారణ దాడి!' అని జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. భిన్నాభిప్రాయాలు ఉండొచ్చుగానీ సుప్రీంకోర్టును ధన్కర్ నిలదీస్తుండటం వేరేస్థాయని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత, న్యాయవాది పి.చిదంబరం కూడా ధన్కర్ తీరును తప్పుపట్టారు. పార్లమెంటే అత్యున్నతమని మాట్లాడటం తగదని ట్వీట్ చేశారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలపై ఆధిపత్య దాడులు జరగకుండా దాని ప్రాథమిక సిద్ధాంతం రూపొందిందన్నారు. 'పార్లమెంటు ఒకవేళ పార్లమెంటరీ వ్యవస్థను రద్దు చేసి దానిని రాష్ట్రపతి వ్యవస్థగా మార్చాలనుకుంటే ఏం జరుగుతుంది? షెడ్యూల్ 7లో రాష్ట్ర జాబితాను రద్దు చేసి రాష్ట్రాల హక్కులను ఉపసంహరించుకుంటే ఏమవుతుంది? ఇటువంటి సవరణలు చెల్లుబాటు అవుతాయా? అని వరుస ట్వీట్లలో చిదంబరం ప్రశ్నించారు.

లూథియానా...చైనాకు పోటీ ఇవ్వగలదు: రాహుల్

లూథియానా: పారిశ్రామిక హబ్ లూథియానాలోని చిరు-మధ్యస్థాయి వ్యాపారాలకు ప్రభుత్వం, బ్యాంకుల నుంచి తగిన సహాయ సహకారాలు అందడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ వ్యాపారాలకు తగిన సహాయం అందితే చైనాకు లూథియానా పోటీ ఇవ్వగలదని ఆయన నొక్కిచెప్పారు. లూథియానా మాంచెస్టర్‌లాంటిదని ఎవరో అంటే పొరబడ్డారని అనుకున్నాగానీ మాంచెస్టరే లూథియానాలా ఉంటుందన్నారు. దేశానికి ఉపాధి అవకాశాలను కుబేరులు కల్పించలేక పోయారుగానీ లూథియానాకు ఆ సత్తా ఉన్నదని రాహుల్ అన్నారు. పంజాబ్‌లో భారత్ జోడో యాత్ర క్రమంలో రాహుల్ మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ తదితర అంశాలను ప్రస్తావించారు. ఇటువంటి తప్పుడు విధానాలు చిరు-మధ్యస్థాయి వ్యాపారాల అంతానికి అస్త్రాలుగా మారాయని వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బీజేపీతో పాటు పంజాబ్ ప్రభుత్వం నుంచీ ఈ వ్యాపారాలకు తగిన మద్దతు లేదన్నారు. దేశంలో విద్వేషాన్ని, హింసను బీజేపీ రెచ్చగొడుతోందని ఆరోపించారు. అన్నాదమ్ములు, కులాలు-మతాల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. 'ద్వేషపూరిత మార్కెట్‌లో లక్షల మంది దుకాణాలు తెరుచుకొన్నారుగానీ ఈ యాత్రలో విద్వేషం కనిపించదు. ఎవరైన కింద పడిపోతే వారిని పైకి లేపందుకు అందరూ ముందుకొస్తారు. కులాలు-మతాలను పట్టించుకోరు. ఇది మన భారతీయ చరిత్ర.. పంజాబ్ చరిత్ర-సంస్కృతి కూడా. దేశానికే కాదు యావత్ ప్రపంచానికి గురునానక్ ఇచ్చిన సందేశం కూడా ఇదే. మన దేశంలో విద్వేషానికి-హింసకు తావు ఉండరాదు. ఇది సోదరభావం, అభిమానం, ప్రేమానురాగాలు, ఒకరంటే ఒకరికి గౌరవం ఉండే దేశం' అని రాహుల్ నొక్కిచెప్పారు. పెద్దనోట్ల రద్దు, చిన్న-మధ్యస్థాయి వ్యాపారాలకు సహకారం లేకపోవడం వంటి అంశాల్లో మోదీ ప్రభుత్వాన్ని విమర్శించారు.

పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం

- ఏడాదికి సగటున రూ.11,994 కోట్ల పెట్టుబడులు
- 1,40,903 మందికి ఉద్యోగాలు
- విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు ఏర్పాట్లపై సీఎం సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశాఖలో, మార్చి 3,4 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు పెట్టుబడులను పెద్దఎత్తున ఆకర్షించడమే లక్ష్యంగా సాగుతుందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. విశాఖపట్నంలో త్వరలో జరగనున్న జీ-20 వర్కింగ్ గ్రూపు సన్నాహక సమావేశం, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్-2023 ఏర్పాట్లపై తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎం సమీక్ష నిర్వహించారు. వాస్తవిక పెట్టుబడులే లక్ష్యంగా సదస్సు ముందుకు సాగాలని, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను సమగ్రంగా వివరించేలా కార్యక్రమం రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కొత్త తరహా ఇంధనాల తయారీ సహా ప్రపంచ వ్యాప్తంగా కొత్త తరహా ఉత్పత్తుల తయారీకి ఏపీ వేదిక కావాలని, దీనికి గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు ఊతం ఇవ్వాలన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు సందర్భంగా వివిధ దేశాల్లో రోడ్‌షోలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. 2019-2022 మధ్య గ్రౌండ్ అయిన పెట్టుబడుల్లో సగటున ఏడాదికి పెట్టుబడులు రూ.15,693 కోట్లు వచ్చాయని, 2019 నుంచి ఇప్పటివరకూ ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రతిపాదనలు రూ.1,81,821 కోట్లు కాగా ఈ పెట్టుబడులన్నీ వేర్వేరు దశల్లో పురోగతిలో ఉన్నాయని, వీటి ద్వారా ఏడాదికి సగటున రూ.11,994కోట్ల పెట్టుబడులు రానుండగా, 1,40,903 మందికి ఉద్యోగ కల్పన జరుగుతోందని అధికారులు వివరించారు. విదేశాలకు వెళ్తున్నప్పుడు అక్కడున్న పారిశ్రామిక వాడలను పరిశీలించాలని, వాటి నిర్వహణపై అవగాహన పెంచుకోవాలని, అలాగే ఆ దేశాల్లో ఎంఎస్ఎంఈలు నడుస్తున్న తీరుపై అధ్యయనం చేయాలని, వాటి నిర్వహణా పద్ధతులను మన రాష్ట్రంలో అవలంబించడంపై దృష్టిపెట్టాలని సీఎం సూచించారు.

విశాఖ సుందరీకరణ పనులు వేగవంతం

ఒక్కొక్క జీ-20 సభ్యదేశం నుంచి ఆరుగురు చొప్పున మొత్తం ప్రపంచ దేశాల నుంచి 250మంది ప్రతినిధులు హాజరవుతారు. అంతర్జాతీయ సంస్థల నుంచి నలుగురు చొప్పున, కేంద్ర ప్రభుత్వం నుంచి మరో 100 మంది ప్రతినిధులు హాజరవుతారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. అవసరమైన రోడ్లు, సుందరీకరణ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని, ప్రధాన జంక్షన్లు, బీచ్ రోడ్డులో సుందరీకరణ పనులు చేపట్టాలని, ఈ సమావేశం సందర్భంగానే కాదు, అన్ని రోజుల్లోనూ ఇవి ఇలాగే ఉండేలా తగిన కార్యాచరణ చేయాలని సీఎం అన్నారు. ఆతిథ్యం, రవాణా తదితర ఏర్పాట్లల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని, అందుకోసం వేర్వేరు కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశానికి హాజరయ్యే ప్రతినిధులకు సౌలభ్యంగా ఉండేందుకు ఒక మొబైల్ యాప్‌ను రూపొందిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి(గిరిజన సంక్షేమశాఖ) పీడిక రాజన్నదొర, ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ) బూడి ముత్యాలనాయుడు, హోంశాఖ మంత్రి తానేటి వనిత, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్, రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్, రహదారులు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రామలింగేశ్వర రావు(రాజా), బీసీ సంక్షేమం, ఐ అండ్ పీఆర్ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాల కృష్ణ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, సీఎస్ డాక్టర్ కే ఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ కే వీ రాజేంద్రనాథ్ రెడ్డి, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవెన్, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ ఎస్ రావత్, పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం టీ కృష్ణబాబు, ఐ అండ్ పీఆర్ కమిషనర్ టి విజయకుమార్ రెడ్డి, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జే శ్యామలరావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, పరిశ్రమలశాఖ డైరెక్టర్ సృజన పాల్గొన్నారు.

'థ్యాంక్యూ శ్రీవల్లీ' వేదికపై కీరవాణి ఎమోషనల్

హైదరాబాద్: ప్రతిష్టాత్మకమైన గోల్డెన్ గ్లోబ్ అవార్డు 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాని వరించిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలోని 'నాటు నాటు' పాటకి బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో అవార్డు దక్కింది. ఈ అవార్డుని సంగీత దర్శకులు ఎం.ఎం.కీరవాణి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ఎమోషనల్ అయ్యారు. వేదికపై కీరవాణి మాట్లాడుతూ.. 'ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.. ప్రతిష్టాత్మక గోల్డెన్ గ్లోబ్ అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ ఉద్వేగాన్ని ఇక్కడే ఉన్న నా భార్య శ్రీవల్లితో షేర్ చేసుకోవడం సంతోషంగా ఉంది. మామూలుగా అవార్డులు అందుకున్నప్పుడు చాలామంది ఇది నాది కాదు.. మరొకరికి చెందుతుందని మాట్లాడుతుంటారు. నేను అలా మాట్లాడకూడదని ప్లాన్ చేసుకున్నాను. కానీ సారీ.. నేనూ అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నా. ఎందుకంటే ఇవి నా మనసులోంచి వచ్చే మాటలు. వరుస క్రమంలో చెప్పాలంటే ముందుగా ఈ అవార్డు నా సోదరుడు, ఈ సినిమా దర్శకుడు రాజమౌళికి దక్కుతుంది. అతని విజన్‌కి, నా మీద నమ్మకంతో నన్ను సపోర్ట్ చేస్తున్నందుకు తనకు ధన్యవాదాలు. అలాగే ప్రేమ్ రక్షిత్, కాలభైరవ, రచయిత చంద్రబోస్, కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్, ఎన్.టి. రామారావు, రామ్‌చరణ్, సాహు సిద్ధార్థ్, జీవన్‌బాబుకు ధన్యవాదాలు. అలాగే చివరిగా ఒకటి చెప్పాలి. థ్యాంక్యూ శ్రీవల్లి... థ్యాంక్యూ వల్లీ' అంటూ ఉద్వేగానికి లోనయ్యారు. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట హల్‌చల్ చేస్తోంది. దీంతో కంగ్రాట్స్ చెబుతూ ఎంతోమంది నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

విశాలాంధ్ర రీల్

ఎన్‌టీఆర్ భాషపై విమర్శలు

హైదరాబాద్: 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలోని 'నాటు నాటు' పాటకి ప్రతిష్టాత్మక గోల్డెన్ గ్లోబ్ అవార్డు వచ్చిన సంగతి తెలిసిందే. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఈ అవార్డుని గెలుచుకుంది. ఈ అవార్డుల కార్యక్రమంలో రాజమౌళి, కీరవాణి, ఎన్టీఆర్, రామ్ చరణ్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కీరవాణి స్టేజ్ మీదకి వెళ్లి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా హాలీవుడ్ మీడియాతో మూవీ టీం మాట్లాడుతూ తన సంతోషాన్ని పంచుకుంది. ఈ తరుణంలో ఎన్టీఆర్ అమెరికన్ యాసలో మాట్లాడారు. దీంతో చాలామంది నెటిజన్లు ఆయన యాసపై ట్రోలింగ్ చేశారు. దీంతో ఎన్టీఆర్ యాసెంట్ అంత దారుణంగా ఏం లేదంటూ బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య తెలిపాడు. ఆయన షేర్ చేసిన ట్వీట్‌లో.. 'ఎన్టీఆర్ యాస జనాలు విమర్శించేంత దారుణంగా ఉందని నేను అనుకోట్లేదు. అలాగే అది అక్కడి పీఆర్ వ్యూహం కావొచ్చు. లైట్ తీసుకోండి.. ఆయన్ని కొత్తగా ప్రయత్నించనివ్వండి. ఆయన హాలీవుడ్ గ్లోబల్ మార్కెట్ వరకు చేరితే అది భారతీయ సినిమాకే మంచిది. మనమందరం దాని నుంచి ప్రయోజనం పొందుతాం' అని సపోర్టుగా రాసుకొచ్చాడు.

సినిమా విడుదలకు స్వేచ్ఛ కావాలి: వెట్రిమారన్



చెన్నై: కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించే చిత్రాలను విడుదల చేసేందుకు మరింత స్వేచ్ఛ కావాలని ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ అన్నారు. ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ కోసం చిత్రాలను నిర్మించే దర్శకుల్లో ఈయన ఒకరు. ఇప్పటికే కొంతమంది హీరోలతో అనేక చిత్రాలు నిర్మించి విడుదల చేశారు. 'పావకథై' అనే అంథాలజీలో 'ఓర్ ఇరవు' అనే పార్ట్‌కు ఈయన దర్శకత్వం వహించారు. 'అనల్ మేల్ పనితుళి' చిత్రాన్ని నిర్మించి ఓటీటీలో రిలీజ్ చేశారు. ఇప్పుడు 'నిలమెల్లాం రత్తం' అనే సిరీస్‌ను నిర్మిస్తున్నారు. తాజాగా ఆయన ఒక సాహిత్య సదస్సులో పాల్గొని మాట్లాడుతూ.. 'మూడేళ్ల క్రితం ఓటీటీలో సినిమాలను విడుదల చేసేందుకు పూర్తి స్వేచ్ఛ ఉండేది. కానీ, ఇప్పుడు ఓటీటీలకు కూడా సెన్సార్ కావాలంటున్నారు. వాస్తవానికి కోట్లాది రూపాయలు వెచ్చించి తెరకెక్కించే చిత్రాలను విడుదల చేసేందుకు ఎక్కువ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కావాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఓటీటీల్లో సినిమాలను విడుదల చేస్తే సినిమా నిర్మాణం కోసం ఖర్చు చేసిన మొత్తం ఖర్చును తిరిగి రాబట్టుకోవచ్చు. ఆ మేరకు గ్యారెంటీ ఉంది. కానీ, థియేటర్లలో విడుదల చేస్తే మరింత లాభాలు పొందొచ్చు. నష్టాలు కూడా రావొచ్చు. కానీ, భవిష్యత్‌లో ఫలానా బ్యానర్‌లోనే ఓటీటీలకు సినిమాలు తీయాలన్న షరతు విధిస్తే మాత్రం కచ్చితంగా నష్టాలను ఎదుర్కోక తప్పదు. ప్రజల కోసం సినిమా తీసి.. వారి కోసం విడుదల చేసే సినిమాల్లో పూర్తి స్వేచ్ఛ ఉంటుంది' అని వెట్రిమారన్ అభిప్రాయపడ్డారు.

సిరీస్ టీమిండియా వశం

- ఎట్టకేలకు అర్ధసెంచరీతో రాణించిన రాహుల్
- మూడు వికెట్లతో మెరిసిన సిరాజ్, కుల్దీప్
- తిరువనంతపురంలో చివరి వన్డే

కోల్‌కతా: శ్రీలంకతో జరిగిన రెండో వన్డేలో టీమిండియా నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక 39.4 ఓవర్లలో 215 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం టీమిండియా 43.2 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో సిరీస్‌ను కూడా టీమిండియా 2-0 తేడాతో గెలుచుకుంది. 216 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా మొదటి 10 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (17: 21 బంతుల్లో, రెండు ఫోర్లు, ఒక సిక్సర్), శుభ్‌మన్ గిల్ (21: 12 బంతుల్లో, ఐదు ఫోర్లు), విరాట్ కోహ్లి (4: 9 బంతుల్లో, ఒక ఫోర్) విఫలం అయ్యారు. శ్రేయస్ అయ్యర్ (28: 33 బంతుల్లో, ఐదు ఫోర్లు) ఉన్నంతలో కాసేపు జట్టును ఆదుకున్నా అతను కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేదు. దీంతో 86 పరుగులకే టీమిండియా నాలుగు కీలక వికెట్లు కోల్పోయింది.

అనంతరం కేఎల్ రాహుల్ (64 నాటౌట్: 103 బంతుల్లో, ఆరు ఫోర్లు), హార్దిక్ పాండ్యా (36: 53 బంతుల్లో, నాలుగు ఫోర్లు) జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 75 పరుగులు జోడించారు. ఆ తర్వాత హార్దిక్‌ను అవుట్ చేసి కరుణరత్నే ఈ భాగస్వామ్యాన్ని విడదీసినప్పటికీ అప్పటికే భారత్ లక్ష్యానికి 55 పరుగుల దగ్గరకి వచ్చేసింది. హార్దిక్ పాండ్యా తర్వాత అక్షర్ పటేల్ (21: 21 బంతుల్లో, ఒక ఫోర్, ఒక సిక్సర్) కూడా అవుటైనా కేఎల్ రాహుల్ చివరి వరకు క్రీజులో ఉండి జట్టును గెలిపించాడు. అంతకు ముందు టాస్ గెలిచిన శ్రీలంక తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. టీమిండియాకు భారీ టార్గెట్ ఇవ్వాలనుకుంది. అందుకు తగ్గట్టే ఓపెనర్లు అవిష్క ఫెర్నాండో (20), నువనిదు ఫెర్నాండో (50) దూకుడుగా ఆడారు. చక్కని బౌండరీలతో అలరించారు. ఆరో ఓవర్ చివరి బంతికి అవిష్కను క్లీన్‌బౌల్డ్ చేసిన సిరాజ్ ఈ జోడీని విడదీశాడు. ఆపై కుశాల్ మెండిస్ అండతో నువనిదు రెచ్చిపోయాడు. 62 బంతుల్లో హాఫ్ సెంచరీ బాదేశాడు. రెండో వికెట్‌కు 66 బంతుల్లోనే 73 పరుగుల భాగస్వామ్యం అందించాడు. ఈ పరిస్థితుల్లో కెప్టెన్ రోహిత్ తెలివిగా స్పిన్నర్లను రంగంలోకి దించాడు. బంతి అందుకున్న వెంటనే మెండిస్‌ను కుల్‌దీప్ ఔట్ చేశాడు. అప్పటికి జట్టు స్కోరు 102. మరో పరుగు వ్యవధిలోనే ధనంజయ డిసిల్వా (0)ను అక్షర్ పటేల్ బౌల్డ్ చేశాడు. జట్టు స్కోరు 118 వద్ద నువనిదు రనౌట్ అయ్యాడు. దాంతో వికెట్ల పతనం మొదలైంది. కుల్‌దీప్ విజృంభించి చరిత్ అసలంక (15), దసున్ శనక (2)ను పెవిలియన్ పంపించాడు. వరుస బౌండరీలు బాదిన వనిందు హసరంగ (21: 17 బంతుల్లో 3×4, 1×6)ను ఉమ్రాన్ ఔట్ చేశాడు. కరుణ రత్నె (17)నూ అతడే పెవిలియన్ పంపించాడు. ఆఖర్లో దునిత్ వెలాలిగె (32: 33 బంతుల్లో 3×4, 1×6), లాహిరు కుమార (0)ను బంతి వ్యవధిలో సిరాజ్ ఔట్ చేసేశాడు. కసున్ రజిత (17) అజేయంగా నిలిచాడు.

ధోనీ, కోహ్లీ కుమార్తెలపై అసభ్య పోస్టులు

కేసు పెట్టాలని మహిళా కమిషన్ ఆదేశం

న్యూదిల్లీ: క్రికెటర్లు ఎంఎస్ ధోని, విరాట్ కోహ్లీ భార్య, కుమార్తెలు లక్ష్యంగా సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులు పెట్టిన నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నగర పోలీసులకు దిల్లీ మహిళా కమిషన్(డీసీడబ్ల్యూ) ఆదేశించింది. ఏడేళ్లు, రెండేళ్ల వయస్సుగల ధోనీ, కోహ్లీ కుమార్తెలు లక్ష్యంగా పెట్టిన పోస్టుల వ్యవహారాన్ని సుమోటోగా తీసుకోవాలని స్పష్టంచేసింది. ఇద్దరు చిన్న పిల్లలు, వారి తల్లులను దుర్భాషలాడుతూ... అసభ్య పదజాలంతో పోస్టులు పెట్టారని, ఇది చాలా తీవ్రమైన అంశమని, సత్వరమే చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై తీసుకున్న చర్యలకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికను జనవరి 16వ తేదీలోగా తమకు అందజేయాలని ఆదేశించింది.

పృథ్వీకి అవకాశం ఇవ్వాలి

వెంకటేశ్ ప్రసాద్

న్యూదిల్లీ: రంజీ ట్రోఫీలో యువ బ్యాటర్ పృథ్వీ షా రికార్డు సృష్టించాడు. అసోం జట్టుపై 379 పరుగులు (383 బంతుల్లో) చేసి.. రంజీ ట్రోఫీ చరిత్రలో రెండో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన బ్యాటర్‌గా అవతరించాడు. ముంబై తరపున ఆడుతున్న పృథ్వీని మళ్లీ జాతీయ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లు వస్తున్నాయి. చివరిసారిగా 2021లో భారత్ తరపున టీ20 మ్యాచ్ ఆడిన పృథ్వీ ఆ తర్వాత జట్టులోకి రాలేకపోయాడు. దీంతో అతడి ప్రదర్శనను మేనేజ్‌మెంట్ పరిగణనలోకి తీసుకొని అవకాశాలు కల్పించాలని టీమిండియా మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్ సూచించాడు. "పృథ్వీ షా అద్భుతమైన ఆటగాడు. ఇలాంటి టాలెంటెడ్ ప్లేయర్‌ను అరుదుగా చూస్తుంటాం. గతంలో జట్టు నుంచి ఏ కారణాలతో తప్పించారనేది అనవసరం. అయితే ఇప్పుడు ఇలాంటి ప్రదర్శన చేయడం వల్ల టీమ్ మేనేజ్‌మెంట్ కూడా పృథ్వీ షాకు అవకాశాలు ఇచ్చే విషయాన్ని ఆలోచించాలి. అతడితో మాట్లాడుతూ.. పర్యవేక్షిస్తూ ఉండాల్సిన బాధ్యత మేనేజ్‌మెంట్‌పై ఉంది. ఇలా చేయడం వల్ల పృథ్వీతోపాటు టీమిండియాకు చాలా మేలు జరుగుతుంది" అని వెంకటేశ్ ప్రసాద్ ట్వీట్ చేశాడు.

పృథ్వీ ఆవేదన ఇదీ..

టాలెంట్ ఉన్నప్పటికీ ఇతర ఆటగాళ్లతో పోలిస్తే పృథ్వీకి అవకాశాలు చాలా తక్కువగానే వచ్చాయి. ఐపీఎల్‌లో అదరగొట్టేసే పృథ్వీని జాతీయ జట్టు ఎంపికలో మాత్రం పెద్దగా పట్టించుకొన్న దాఖలాలు లేవు. దీంతో ఒకానొక సందర్భంలో పృథ్వీ షా తన ఆవేదనను వ్యక్తం చేశాడు. "కొన్నిసార్లు చాలా నిరుత్సాహానికి గురవుతుంటా. ఎందుకంటే మనవంతుగా సరైన పద్ధతిలోనే వెళ్తున్నప్పటికీ.. మంచి ఆటతీరు కనబరిచినా.. మైదానంలోనూ, వెలుపల క్రమశిక్షణతో వ్యవహరించినా అవకాశాలు రాకపోవడంపై అభిమానులు పలురకాలుగా మాట్లాడుతుంటారు. మన గురించి తెలియనివారు కూడా జడ్జ్ చేస్తుంటారు" అని పృథ్వీ షా తెలిపాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.